జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | ఆదివారం 26 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 141 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: ఏకాదశి - 11:36:40 వరకు నక్షత్రంజ్యేష్ఠ - నిండా రాత్రి వరకు కరణంవిష్టి - 11:36:40 వరకు, బవ - 24:48:56 వరకు పక్షంశుక్ల యోగంబ్రహ్మ - 21:08:49 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

### ఎఐతో ఉన్న భయాలు తొలగించాలి

**ఎఐపై ఉన్న అపోహలు తొలగిస్తేనే భవిష్యత్**
**మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు**

న్యూయార్క్,జూలై25(ప్రజాజ్యోతి): ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని

మిగతా 2లో..

### గుజరాత్‌లో వరదల బీభత్సం

**వల్సాడ్‌లో నీట మునిగిన గృహసముదాయాలు**

గాంధీనగర్,జూలై25(ప్రజాజ్యోతి): గుజరాత్‌లోని వల్సాడ్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు

మిగతా 2లో..

# ‘రాజీ’పడ్డారు

## నీట్ ఆందోళనతో దిగివచ్చిన ధర్మేంద్ర ప్రధాన్
## దేశ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదనే నిర్ణయం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆమోదం
- కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి
- ధర్మేంద్రను అభినందించిన అమిత్ షా
- ప్రధాని మోడీతో తాజా పరిస్థితులపై చర్చ

న్యూఢిల్లీ,జూలై25(ప్రజాజ్యోతి): నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్రమోడీకి పంపారు. యువత, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనలకు కేంద్ర మంత్రి దిగొచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తన రాజీనామా లేఖలో ఆయన మాట్లాడుతూ.. గత నాలు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలోకి పనిచేస్తున్నామని తెలిపారు. దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడంతో తన నైతిక బాధ్యతగా భావించినట్లు లేఖలో పేర్కొన్నారు. 2026 మే 3న నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించిందని గుర్తు చేశారు. పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో

మిగతా 2లో..



## కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ యూజీ పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు.



## కేంద్రంతో చర్చలు సఫలం..

**జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు**
**కేంద్రమంత్రులతో సిజెపి ప్రతినిధుల చర్చలు ఫలప్రదం**
**విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం**
**భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ**
**ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్**

న్యూఢిల్లీ,జులై 25 (ప్రజాజ్యోతి): జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిమారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను

మిగతా 2లో..

## మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- విద్యార్థులే నిజమైన దేశభక్తులు
- ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్
- రాహుల్ గాంధీ, ప్రియాంక హర్షం
- కేంద్రం తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు
- ధర్మేంద్ర రాజీనామాపై వాంగ్‌చుక్ హర్షం

న్యూఢిల్లీ,జులై 25 (ప్రజాజ్యోతి): ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయమని, ప్రధాని మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి అని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..




## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి


- అప్పడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి
- తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం
- ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సీఎం

హైదరాబాద్,జూలై25(ప్రజాజ్యోతి): చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయనిఅన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన

మిగతా 2లో..

## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

- గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే
- రాజీనామాతో జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత
- మరోమారు రెచ్చిపోయి పోలీసులపై రాళ్ల దాడి
- ఇద్దరు పోలీసులకు తీవ్ర గాయాలు
- సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు



న్యూఢిల్లీ,జూలై25(ప్రజాజ్యోతి): నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో

మిగతా 2లో..

## పదవులు తాత్కాలికం..

ప్రజల విశ్వాసమే అంతిమం: బండి

హైదరాబాద్,జులై 25 (ప్రజాజ్యోతి): 'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు.

మిగతా 12లో..

## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

ధర్మేంద్ర రాజీనామాపై కేటీఆర్ పోస్ట్

హైదరాబాద్,జులై 25 (ప్రజాజ్యోతి): యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజేపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు

మిగతా 12లో..

## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన

సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు




న్యూఢిల్లీ,జూలై25(ప్రజాజ్యోతి): హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో..

మిగతా 12లో..

## ఇందిరమ్మ టవర్స్ కోసం హెల్ప్‌లైన్

**ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం**
**ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్**

హైదరాబాద్,జులై 25 (ప్రజాజ్యోతి): క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో దరఖాస్తుదారులకు

మిగతా 2లో..

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు



**రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి**
**త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు ఖరారు**
**రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత**
**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి**

హైదరాబాద్,జులై 25 (ప్రజాజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర

మిగతా 12లో..

# సంపాదకీయం

## కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు?

విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు-నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది.

పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్‌ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజెపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజెపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదారి పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

# 'రాజీ'పడ్డారు

మొదటిపేజీ తరువాయి..

నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 20 లక్షల మందికి పైగా విద్యార్థుల కోసం తిరిగి పరీక్ష విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జూన్ 21నపరీక్ష విజయవంతంగా పూర్తయిందని అన్నారు. తాను మొదటి రోజు నుంచే బాధ్యత తీసుకున్నాని, ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోకుండా కృషి చేశానని పేర్కొన్నారు. జూలై 16న ప్రకటించిన ఫలితాల్లో పేద, వెనకబడిన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు విజయాన్ని సాధించడం సంతోషకరమని అన్నారు. ఇదే సమయంలో బాధ్యతయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థుల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను బాధించిందని చెప్పారు. గత 10 రోజులుగా జరిగిన పరిణామాలు కలిచివేశాయని, ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేసింది. జంతర్ మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, దేశవ్యతిరేక శక్తులు దీనిని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, జాతీయ ఐక్యత కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండేందుకు, వారు చదువులపై దృష్టి సారించేలా చేయడానే ఉద్దేశంతోనే ప్రధాన మంత్రికి రాజీనామా లేఖ సమర్పించినట్లు వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచిన ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు, విద్యాశాఖ అధికారులకు థాంక్స్ చెప్పారు. దేశ సేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులోనూ ఒడిశా ప్రజలు, దేశ యువత కోసం సేవ చేస్తూనే ఉంటానని పేర్కొన్నారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్స్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. భారత్ చొరవతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా.. ధర్మేంద్ర ప్రధాన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్‌ను అమిత్ షా ప్రశంసించారు. దేశ విద్యా వ్యవస్థలో ధర్మేంద్ర ప్రధాన్ ఎన్నో సంస్కరణలు తెచ్చారని కొనియాడారు. విద్యాశాఖలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా అత్యవసరంగా భేటీ అయ్యారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తదనంతర పరిణామాలు, దేశ రాజధానిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, క్యాబినెట్‌లో మార్పులపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని మోదీ నివాసంలో ఈ భేటీ జరిగింది.

# కేంద్రంతో చర్చలు సఫలం..

మొదటిపేజీ తరువాయి..

విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం దిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. దిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు. సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు.

యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు. తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు. అవి సాధించేవరకూ ముందుకు సాగుతూనే ఉంటామని అన్నారు.

## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

మొదటిపేజీ తరువాయి..

ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులు పోలీసులపై రాళ్ల దాడికి దిగారు. నిరసనకారుల రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వారి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే జంతర్ మంతర్ వద్ద అదనపు బలగాలు మోహరించాయి. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు. అభిజిత్‌ను అభినందిస్తూ భుజాలపైకి ఎత్తుకున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. కాగా, నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు.

మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి. విద్యావ్యవస్థపై లోపాలను ఎత్తిచూపుతూ పుట్టుకొచ్చిన పార్టీనే సీజేపీ సరిగ్గా రెండు నెలల క్రితం అభిజీత్ దీప్కే దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని గంటల్లోనే ఇంటర్నెట్‌లో దాని పేరు మార్మోగిపోయింది. తర్వాత నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దీప్కే జంతర్ మంతర్ వద్ద ప్రారంభించిన నిరసనలకు భారీ సంఖ్యలో యువత స్పందించింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిరసన వేదికవద్దకు వచ్చి మద్దతు తెలిపారు. జులై 20న 'చలో పార్లమెంట్' మార్చ్, ప్రధాన్ రాజీనామా నుంచి సీజేపీ వెనక్కి తగ్గకపోవడంతో ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చింది. ఈ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించిన 30 ఏళ్ల దీప్కే.. మహారాష్ట్రలోని పుణెలో జర్నలిజం చదివారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేశారు.

## ఎఐతో ఉన్న భయాలు తొలగించాలి

మొదటిపేజీ తరువాయి..

వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకత కు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

## గుజరాత్‌లో వరదల బీభత్సం

మొదటిపేజీ తరువాయి..

తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

## ఇందిరమ్మ టవర్స్ కోసం హెల్ప్‌లైన్

మొదటిపేజీ తరువాయి..

సమాచారం అందించనున్నారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తూ, ఆధార్ కార్డు ఒక్కటే సరిపోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఇతర పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, రూ.10 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ ను యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ ప్లాట్ కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు ఈ మొత్తం తిరిగి జమ చేయనున్నట్లు వెల్లడించారు. క్యూర్ పరిధిలో కనీసం 10 సంవత్సరాలు నివాసం ఉండాలని మంత్రి తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే క్యూర్ లేదా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఇప్పటికే సొంత ఇల్లు లేదా స్థలం ఉన్నవారు ఈ పథకానికి అర్హులు కాదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అర్హుల సంఖ్య అందుబాటులో ఉన్న ప్లాట్ల కంటే ఎక్కువగా ఉంటే లాటరీ విధానంలో కేటాయింపులు చేపడతారని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్‌లో ప్లాట్ ధర రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని స్పష్టం చేశారు. మిగిలిన మొత్తంలో లబ్దిదారుడు తన వాటాగా రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు.


# మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి

మొదటిపేజీ తరువాయి..

అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్టపోయిన కుటుంబాలు అన్నింటిదీ ఈ విజయమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు నుంచి వీధుల వరకు ఏకతాటిపై నిలిచి పోరాడిన ప్రతిపక్షాల ఐక్యతే ఈ విజయానికి కారణమని ఆయన స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతరానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రస్తావిస్తూ.. ఇది తమ డిమాండ్ల కోసం దృఢంగా నిలబడి నిరసన తెలిపిన యువతకు, ప్రజాస్వామ్యానికి దక్కిన భారీ విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టు క్షణాల్లో వైరల్ కాగా దీనిపై ప్రియాంక చోప్రా స్పందిస్తూ 'నమస్కారం', 'లవ్' ఎమోజీలను జతచేసి తన మద్దతు చాటారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిణామం విద్యా రంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న



సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయని పేర్కొన్నారు. జెన్-జీ, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శనివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది శాంతి, ఓర్పు, నిరంతర పట్టుదలల విజయం. దేశంలోని సీజేపీ, జెన్ జీ యువతకు అభినందనలు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు బాధ్యతాయుతమైన సమాధానం కోరాం. ఇకపై సంస్కరణల వైపు సాగుదాం' అని రాసుకొచ్చారు.

# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

మొదటిపేజీ తరువాయి..

చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ



చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

## ప్రధాని వ్యాఖ్యలపై ఫిర్యాదు




**బాసర జూలై 25 (ప్రజాజ్యోతి) :** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, ఆయన అనుచరులపై శనివారం బాసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాయినాథ్ పటేల్, మాజీ జెడ్పీటీసీ పోగుల రాజేశ్వర్, శంకర్, సాయినాథ్, రమేష్ తదితరులు ఏఎస్ఐ శ్యాములకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ ప్రధానిగా రెండు పర్యాయాలు సేవలందిస్తున్న నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## బొగ్గు గనుల భవిష్యనిధి సంస్థ (సీఎంపీఎఫ్ఓ) సతీష్ కుమార్ కొత్త కోల్ కంట్రోలర్‌గా నియామకం..

**– సజీష్ ఎన్‌కు బదిలీ**




**మంచిర్యాల, 25, జూలై (ప్రజాజ్యోతి) :** బొగ్గు గనుల భవిష్యనిధి సంస్థ (సీఎంపీఎఫ్ఓ) బాధ్యతలను నిర్వహిస్తున్న కమిషనర్‌తో పాటు బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ కంట్రోలర్ (సంయుక్త కార్యదర్శి స్థాయి)గా పనిచేస్తున్న సజీష్ ఎన్‌ను సామాజిక న్యాయం అండ్ సాధికారత మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో భారతీయ రైల్వే సేవ (ఎలక్ట్రికల్), 2002 బ్యాచ్‌కు చెందిన ఐఆర్‌టీఎస్ అధికారి సతీష్ కుమార్ను కొత్త కోల్ కంట్రోలర్ (సంయుక్త కార్యదర్శి స్థాయి)గా నియమించారు. సజీష్ ఎన్ ఇప్పటివరకు కోల్ కంట్రోలర్ బాధ్యతలతో పాటు సీఎంపీఎఫ్ఓ కమిషనర్ అదనపు బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. ఆయన బదిలీ నేపథ్యంలో సీఎంపీఎఫ్ఓ కమిషనర్ అదనపు బాధ్యత ఎవరికి అప్పగిస్తారన్న అంశంపై ఆసక్తి నెలకొంది. కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదంతో, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ (డీఓపీటీ) జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, సంజయ్ చిల్లవార్ స్థానంలో సజీష్ ఎన్ సామాజిక న్యాయం ఒ సాధికారత శాఖలో సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సీఎంపీఎఫ్ఓ కమిషనర్ అదనపు బాధ్యత కూడా సతీష్ కుమార్‌కే దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది .బొగ్గు మంత్రిత్వ శాఖ వర్గాల సమాచారం ప్రకారం, సీఎంపీఎఫ్ఓ కమిషనర్ అదనపు బాధ్యతను సంప్రదాయంగా మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారికే అప్పగిస్తారు. ఇప్పటివరకు ఆ బాధ్యత కోల్ కంట్రోలర్ వద్దే ఉండటంతో, కొత్త కోల్ కంట్రోలర్‌గా నియమితులైన సతీష్ కుమార్‌కే సీఎంపీఎఫ్ఓ కమిషనర్ అదనపు బాధ్యత కూడా అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, దీనిపై తుది నిర్ణయం బొగ్గు మంత్రిత్వ శాఖ తీసుకోనుంది. సీఎంపీఎఫ్ఓలో రెగ్యులర్ కమిషనర్ పదవి చాలా కాలంగా ఖాళీగా ఉండటంతో, కొత్త కోల్ కంట్రోలర్ నియామకంతో పాటు కొత్త కమిషనర్ బాధ్యతలపై కూడా చర్చ జరుగుతోంది.

## విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా 27న కలెక్టరేట్ వద్ద సీపీఐ ధర్నా




**మంచిర్యాల, 25, జూలై (ప్రజాజ్యోతి) :** కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను విస్మరించి శాంతియుత ఆందోళనలపై దాడులకు పాల్పడటం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు దేశవ్యాప్తంగా శాంతియుతంగా చేపడుతున్న ఆందోళనలపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అమానుషంగా వ్యవహరించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులపై జరిగిన దాడి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడికి నిరసనగా ఈ నెల 27వ తేదీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ప్రజలు, విద్యార్థులు, పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, చాడా మహేందర్ రెడ్డి, దేవి పోచన్న, మద్దెల శంకర్, రాయమల్లు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు

### గోదావరి పుష్కరాలు-2027 భద్రతా ఏర్పాట్లపై

# డీజీపీ కార్యాలయం ద్వారావీడియో కాన్ఫరెన్స్

**– వాచ్ టవర్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీసీటీవీలతో పకడ్బందీ భద్రతకు ఆదేశాలు – జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల వెల్లడి**






**ఖానాపూర్ జూలై 25 (ప్రజా జ్యోతి) :** 12 ఏళ్లకు ఓసారి వచ్చే పుష్కరాలను అత్యంత కట్టుదిట్టంగా శాంతి భద్రత పరిరక్షణలే ముఖ్యంగా పోలీస్ శాఖ పనిచేయాల్సిందని రాష్ట్ర డిజిపి కార్యాలయం నుండి జిల్లాల వారీగా టెలికాన్ఫరెంట్స్ నిర్వహించడం శనివారం జరిగింది ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల తో జరిగిన కాన్ఫరెన్స్ వివరాలు ఇలా ఉన్నాయి

గోదావరి పుష్కరాలు--2027 సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై డీజీపీ కార్యాలయం నుంచి ఏడీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్, రాష్ట్రంలోని పుష్కర జిల్లాల పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పుష్కర ఘాట్‌ల వద్ద వాచ్ టవర్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు, డ్రోన్ సర్వైలెన్స్, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర స్పందన బృందాలు వంటి భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఏడీజీపీ ఆదేశించారు. అలాగే నిర్మల్ జిల్లాలోని బాసర, సోన్, సావర్గాం ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్,ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, కృష్ణ, సత్యనారాయణ, దీపక్, రవీందర్, ఆర్ఐ రామ్‌నిరంజన్, సబ్ ఇన్‌స్పెక్టర్లు సంబంధిత పోలీస్‌అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం - కూచడి శ్రీహరి రావు





**సారంగాపూర్, జులై 25,ప్రజా జ్యోతి :** నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు మండలంలో నిర్వహించిన బూత్ లెవల్ సూపర్‌వైజర్లు బూత్ లెవల్ ఏజెంట్లు,సమన్వయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి బూత్ లెవల్ సూపర్‌వైజర్, బూత్ లెవల్ ఏజెంట్ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ, మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో సమన్వయంతో పనిచేసి, ఆగస్టు 3వ తేదీలోపు అర్హులైన ప్రతి ఓటరి నమోదు, సవరణలు, ఆన్‌లైన్ ప్రక్రియలను 100 శాతం పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మండలానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, స్థానిక సర్పంచ్ మల్లేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, భీంరెడ్డి, రాజ్ మహ్మద్, జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి గాజుల రవికుమార్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొట్టె శేఖర్,బొల్లోజీ నర్సయ్య,పోతారెడ్డి,మల్లేష్ యాదవ్, మజర్, సాక్‌పెల్లి సురేందర్ వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కరోనా సమయంలో నిలిపివేసిన సీనియర్ సిటిజన్ల రైల్వే రాయితీలను పునరుద్ధరించాలి






**– ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ (ఏఐఎస్‌సీసీకాన్) జాతీయ అధ్యక్షుడు ఎం. కె. రైనా**
**– పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అంశాన్ని ప్రస్తావించాలి**
**– పెద్దపల్లి ఎంపీకి తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య వినతి**

**మంచిర్యాల, 25, జులై (ప్రజాజ్యోతి) :** కరోనా–2019 సమయంలో నిలిపివేసిన సీనియర్ సిటిజన్ల రైల్వే ప్రయాణ రాయితీలను తక్షణమే పునరుద్ధరించాలని ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ (ఏఐఎస్‌సీసీకాన్) జాతీయ అధ్యక్షుడు ఎం. కె. రైనా కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. దేశంలోని కోట్లాది మంది వయోవృద్ధులు ఈ రాయితీ ద్వారా ప్రయోజనం పొందుతున్నారని, ప్రస్తుతం పెరుగుతున్న జీవన వ్యయం, వైద్య ఖర్చుల దృష్ట్యా రైల్వే రాయితీల పునరుద్ధరణ అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సీనియర్ సిటిజన్లకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లను గౌరవ పార్లమెంట్ సభ్యులు ప్రస్తావించి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎం. కె. రైనా కోరారు. అలాగే ఈ విజ్ఞప్తిని దేశవ్యాప్తంగా ఉన్న గౌరవ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులకు చేరవేయాలని, మరింత మంది సీనియర్ సిటిజన్లలో అవగాహన కల్పించి ఉద్యమానికి బలం చేకూర్చాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ అధ్యక్షుడు ఎం. కె. రైనా పిలుపు మేరకు తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య (టెన్‌సీకాన్) మంచిర్యాల జిల్లా శాఖ తరపున పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడికి వినతిపత్రాన్ని పంపినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సైండ్ల మొండయ్య తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కరోనా సమయంలో నిలిపివేసిన సీనియర్ సిటిజన్ల రైల్వే రాయితీల పునరుద్ధరణ అంశాన్ని సభ దృష్టికి తీసుకువెళ్లి, కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేయాలని ఎంపీని కోరినట్లు తెలిపారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య నిరంతరం కృషి చేస్తోందని, సీనియర్ సిటిజన్ల న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఈ అంశంపై పెద్దపల్లి ఎంపీ సానుకూలంగా స్పందించి, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సీనియర్ సిటిజన్ల రైల్వే రాయితీల పునరుద్ధరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన న్యాయం జరిగేలా కృషి చేస్తారని తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సైండ్ల మొండయ్య, ప్రధాన కార్యదర్శి కె. ఎం. ఎస్. రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాదయాత్రగా విఠలేశ్వర స్వామి ఆలయానికి..



**బాసర జూలై 25 (ప్రజా జ్యోతి) :** బాసర, మండల కేంద్రం నుండి తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం గ్రామస్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ పాదయాత్రగా నవీపేట మండలం యంచ గ్రామంలోని విట్టలేశ్వర స్వామి దర్శనానికి బయలుదేరారు. ఈ సందర్భంగా విట్టలేశ్వరుని భక్తులు మహిళలు భక్తి గీతాలను ఆలపిస్తూ భజన చేసుకుంటూ బయలుదేరారు.

## వెంకటాపూర్ గ్రామస్తుల మానవత్వం..

**నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం**



**నేరడిగొండ, జులై 25 (ప్రజా జ్యోతి) :** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మానవత్వం పరిమళించింది. గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న అడెల్లు అనే నిరుపేద ఈ నెల 21వ తేదీన అకాల మరణం చెందారు. ఆ పేద కుటుంబం అంతిమ సంస్కారాలు మరియు ఇతర ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన వెంకటాపూర్ గ్రామ ఉద్యోగులు, గ్రామస్తులు పెద్ద మనస్సుతో స్పందించారు. సమష్టిగా రూ. 25,000 (ఇరవై ఐదు వేల రూపాయలు) విరాళంగా సేకరించి, శనివారం అడెల్లు కోడలికి ఆ మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన గ్రామానికి, ఉద్యోగులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయ కార్యక్రమంలో వెంకటాపూర్ సర్పంచ్ వెంకట్ రామ్, ఉపసర్పంచ్ కృష్ణా, గ్రామ నాయక్ గంగారాం నాయక్, కరోబార్ రూప్ల నాయక్, మాజీ సర్పంచ్ గోపీచంద్, గ్రామ పెద్దలు, వెంకటాపూర్ నాయక్ యూత్ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొని తమ ఉదారతను చాటుకున్నారు.

## యువత ఐక్యతకు కేంద్రం తలవంచింది

**కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ హర్షం**



**మంచిర్యాల, 25, జులై (ప్రజా జ్యోతి) :** దేశవ్యాప్తంగా గత నెల రోజులుగా విద్యార్థులు, యువత సాగించిన ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం యువశక్తి సాధించిన చారిత్రాత్మక విజయమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, "ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదు.. తమ హక్కుల కోసం దేశమంతా ఒక్కటై పోరాడిన భారతీయ యువత సాధించిన అపూర్వ విజయం. యువకులు ఒక లక్ష్యం కోసం కంకణం కట్టుకుని రోడ్డెక్కితే ఎంతటి ప్రభుత్వమైనా ప్రజల ఆకాంక్షలకు తలవంచాల్సిందేనని ఈ ఘటన మరోసారి నిరూపించింది" అని అన్నారు. విద్యార్థుల ఆందోళనలు, యువత ఆవేదనను కేంద్ర ప్రభుత్వం విస్మరించలేక చివరకు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ అధికార బీజేపీ ప్రభుత్వం అవలంబించిన అహంకార వైఖరికి ఈ రాజీనామా చెంపపెట్టు వంటిదని విమర్శించారు. ప్రజల సమస్యలపై కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించిన ఎంపీ, విద్యార్థుల భవిష్యత్తుతో, వారి హక్కులతో మళ్లీ చెలగాటమాడే ప్రయత్నాలు జరిగితే యువతతో కలిసి మరోసారి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతకు అభినందనలు తెలియజేస్తూ, వారి ఐక్యత, పట్టుదల, పోరాటస్ఫూర్తి దేశ ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చాయని కొనియాడారు. చివరగా "జై హింద్... జై భారత్!" అన్నారు.

## రహదారుల పైపశువుల సంచారానికి చెక్



**మంచిర్యాలరూరల్ జులై 25 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల జిల్లాలో రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురై గాయపడగా, కొన్ని ఘటనల్లో ప్రాణనష్టం కూడా సంభవించింది. ఈ నేపథ్యంలో రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. ఈనెల 21న జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన రోడ్ సేఫ్టీ సమావేశంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు అమలు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ జి.అన్వేష్ నగరంలోని ప్రధాన రహదారులను పరిశీలించి పశువుల యజమానులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. వారం రోజులలోగా రహదారులపై పశువులను వదిలే అలవాటును పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి పశువులను రోడ్లపై వదిలేస్తే వాటిని స్వాధీనం చేసుకుని గోశాలలకు తరలిస్తామని తెలిపారు. అనంతరం యజమానులు తమ పశువులను తిరిగి తీసుకెళ్లాలంటే గోశాల సంరక్షణ ఖర్చులతో పాటు కార్పొరేషన్ నిర్ణయించిన జరిమానాను చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి పౌరుడి సహకారం అవసరమని, పశువుల యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పశువులను తమ ఇళ్ల వద్ద లేదా తగిన స్థలాల్లోనే ఉంచాలని కమిషనర్ కోరారు. ప్రజల ప్రాణాల రక్షణే ఈచర్యల ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.


# కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్-1998లో భారీ మార్పులకు బ్రేక్.. పెన్షన్ పెంపుపై కేంద్రం స్పష్టీకరణ

**మంచిర్యాల, 25, జులై (ప్రజాజ్యోతి) :** కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్--1998 (సీఎంపీఎస్--1998)లో భారీ మార్పులు, కనీస పెన్షన్ పెంపు, అర్హత నిబంధనల సడలింపు వంటి అంశాలపై నెలకొన్న ఆశలకు కేంద్ర ప్రభుత్వం తాజాగా తెరదించింది. ప్రస్తుతం కోల్ మైన్స్ పెన్షన్ పథకంలో విస్తృత స్థాయి సవరణలు చేపట్టే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌లో స్పష్టం చేసింది. పార్లమెంట్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో, కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్‌లో పెన్షన్ పెంపు లేదా ఇతర కీలక మార్పులపై ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్రం తెలిపింది. దీంతో పెన్షన్ పెంపుపై ఆశలు పెట్టుకున్న దేశవ్యాప్తంగా లక్షలాది కోల్ మైన్స్ పెన్షనర్లకు నిరాశ ఎదురైంది. కార్మిక సంఘాలు, పెన్షనర్ల సంఘాలు చాలా కాలంగా కనీస పెన్షన్‌ను గణనీయంగా పెంచాలని, పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ)ను అమలు చేయాలని, పెన్షన్ అర్హత నిబంధనలను సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే ఈ డిమాండ్లపై ఇప్పటివరకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోలేదని వెల్లడైంది. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం, కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్‌లో ఎలాంటి మార్పులు చేసినా వాటి ఆర్థిక ప్రభావం, పెన్షన్ నిధి దీర్ఘకాలిక స్థిరత్వం, భవిష్యత్ ఆర్థిక భారం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది. అందువల్ల ప్రస్తుతం పెద్ద ఎత్తున మార్పులు చేపట్టే పరిస్థితి లేదని తెలిపింది . ఈ ప్రకటనపై కోల్ మైన్స్ పెన్షనర్ల సంఘాలు తీవ్ర నిరాశ వ్యక్తం చేశాయి. ప్రస్తుతం అందుతున్న పెన్షన్ పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయాల దృష్ట్యా సరిపోవడం లేదని, పెన్షనర్ల జీవనం రోజురోజుకూ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కనీస పెన్షన్‌ను పెంచడంతో పాటు డీఏ అమలు చేసి, అన్ని పెన్షనర్లకు మెరుగైన సామాజిక భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి కోరాయి. మొత్తంగా, కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్--1998లో భారీ మార్పులు లేదా పెన్షన్ పెంపుపై ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేయడంతో, పెన్షనర్ల ఆశలు ప్రస్తుతానికి వాయిదా పడినట్లయ్యాయి.

**– కోల్ మైన్స్ పెన్షన్ నిధిని బలోపేతం చేయాలి -- కనీస పెన్షన్ 10 వేల కు పెంచాలి**

**– సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్**

కోల్ మైన్స్ పెన్షన్ నిధిని బలోపేతం చేయడానికి కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కృషి చేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న కనీస పెన్షన్‌ను 10 వేలకు కు పెంచడంతో పాటు, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కరువు భత్యం (డీఏ) ఆధారంగా పెన్షన్‌ను సవరించి ప్రతి




నెల చెల్లించే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దశాబ్దాల పాటు దేశ బొగ్గు పరిశ్రమ అభివృద్ధికి తమ శ్రమను అంకితం చేసిన కోల్ మైన్స్ కార్మికులు పదవీ విరమణ అనంతరం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పెన్షన్‌తో కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు, రోజువారీ అవసరాలు తీర్చుకోవడం చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్ మైన్స్ పెన్షన్ నిధి ఆర్థికంగా మరింత బలోపేతం కావాలంటే కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించి అవసరమైన నిధులు సమకూర్చాలని సూచించారు. బొగ్గు పరిశ్రమ అభివృద్ధికి జీవితాంతం సేవలందించిన కార్మికులు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడిపేలా కనీస పెన్షన్‌ను 10 వేల కు పెంచడం, డీఏను అనుసంధానం చేసి ప్రతి నెల చెల్లించే విధానాన్ని అమలు చేయడం అత్యవసరమని ఆళవందార్ వేణు మాధవ్ ప్రభుత్వాన్ని కోరారు.

# సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- ప్రతి బుధవారం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు : ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జూలై 25 (ప్రజా జ్యోతి బ్యూరో ): రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా ఎస్పీ దరావత్ జానకి తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, సైబర్ క్రైమ్ అధికారులు, ఐటీ సెల్ సిబ్బంది, సైబర్ వారియర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నందున ప్రతి పోలీసు అధికారి సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి బుధవారం గ్రామాలు, వార్డులు, కాలనీలు, వీధుల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సైబర్ మోసాల్లో "గోల్డెన్ అవర్" అత్యంత కీలకమని పేర్కొన్న ఎస్పీ, మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేస్తే మోసపోయిన నగదును "పుట్ ఆన్ హోల్డ్" చేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు.

ఈ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని పోలీసు అధికారులకు సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో, నకిలీ పోలీసు, సీబీఐ, కోర్టు అధికారులుగా నటించడం, కేవైసీ అప్‌డేట్, బ్యాంకు ఖాతా బ్లాక్, ఉద్యోగాలు, పెట్టుబడులు, ట్రేడింగ్, పార్ట్‌టైమ్ జాబ్స్, లోన్ యాప్స్, సోషల్ మీడియా హ్యాకింగ్, క్యూఆర్ కోడ్ స్కామ్స్, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, గిఫ్ట్, లాటరీ, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు వంటి అనేక రూపాల్లో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని తెలిపారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను నమ్మవద్దని, అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, పాస్‌వర్డ్లు, బ్యాంకు వివరాలు, ఏటీఎం, సీవీవీ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు ఎస్పీ సూచించారు.

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, సమయానికి స్పందిస్తే పోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలందరికీ సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం పోలీసు శాఖ బాధ్యత అని,




ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని ఎస్పీ జానకి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్.బీ. రత్నం, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, గిరికుమార్, వివిధ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఐటీ సెల్ సిబ్బంది, డీఫోర్స్ అధికారులు, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి: నిరంజన్ రెడ్డి

- పట్టణం, పెద్దమందడిలో 'సర్' ప్రక్రియ పరిశీలన
- 100 శాతం నమోదు లక్ష్యంగా పనిచేయాలని పిలుపు

వనపర్తి, జూలై 25 (ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే వజ్రాయుధం ఓటు హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి



పట్టణంతో పాటు పెద్దమందడిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి 'సర్' ప్రక్రియను పరిశీలించిన ఆయన, ఓటరు జాబితా సవరణను బాధ్యతగా తీసుకుని ప్రతి అర్హుడి పేరు తుది జాబితాలో ఉండేలా బీఎల్వోలు, బీఎల్ఏలు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వనపర్తి పట్టణంలో మొత్తం 63,246 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు కేవలం 67 శాతం మాత్రమే ఆన్‌లైన్ నమోదు పూర్తైందని పేర్కొన్నారు. మిగిలిన నమోదును కూడా త్వరగా పూర్తి చేసి వనపర్తిని ఆదర్శ పట్టణంగా నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణలతో మారుమోగిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం

-ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు భక్తులకు దర్శనం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 25 (ప్రజా జ్యోతి): ఆషాడ తొలి ఏకాదశి రోజున శ్రీవారిని దర్శించుకోవడం వల్ల సకల పాపాలు నశించి, దైవ కృప లభిస్తుందని అర్చకులు వంశీ జోషి తెలిపారు. శనివారం ఆషాడ తొలి ఏకాదశి సందర్భంగా నారాయణ పేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలో బ్రాహ్మణవాడలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తుల గోవింద నామ స్మరణతో మారుమోగింది. తొలి ఏకాదశి సందర్భంగా అర్చకులు వంశీ





జోషి,కౌశిక్ వెంకటేశ్వర స్వామి వారికి తెల్లవారుజామున పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శనం చేసుకునేందుకు తెల్లవారుజాము నుండి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. భక్తుల స్వామివారిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు. తొలి ఏకాదశి రోజున కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం మరియు పూజించడం వల్ల జన్మజన్మల పాపాలు తొలగి, సకల ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు మరియు స్వామివారి సంపూర్ణ అనుగ్రహం లభిస్తుందని అర్చకులు వంశీ జోషి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తుడు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

-ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ : జులై 25 (ప్రజా జ్యోతి) తెల్కపల్లి మండల కేంద్రంలోని సబ్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నూతనంగా నిర్మించ నున్న షాపింగ్ కాంప్లెక్స్,సి.సి పేవ్‌మెంట్ పనులకు ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శంకుస్థాపన





చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు,వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.మార్కెట్‌లో ఆధునిక వసతులు కల్పించడం ద్వారా రైతులు,వ్యాపారు లు మరింత సౌకర్యవంతమైన వాతావరణంలో తమ కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు.అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో,నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు,మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,స్థానిక కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిధులు,కమిటీ సభ్యులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, రైతులు,మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. వరికి బ్రేక్!

- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలి
- తక్కువ నీటితో సాగయ్యే పంటలే మేలు
- డా. జిల్లెల్ల చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జూలై 25 (ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి సూచించారు. శనివారం గోపాల్పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామంలో నిర్వహించిన రైతు గ్రామసభలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపికలో నీటి లభ్యత, పెట్టుబడి, మార్కెట్ అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని డా. చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడి, భూసార పరీక్షలు, సూక్ష్మ నీటిపారుదల, ఫార్మ్‌పాండ్లు, ఇంకుడు గుంటల వినియోగాన్ని పెంచాలని సూచించారు. కందులు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలో




సుమారు 34 శాతం మేర కరవు పరిస్థితులు నెలకొన్నాయని, జయన్న తిరుమలాపూర్‌లో 700 ఎకరాలు పూర్తిగా వర్షాధార సాగులో ఉన్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అధిక నీటి అవసరమున్న వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం రైతులకు ప్రయోజనకరమని సూచించారు. పంటల ప్రణాళిక రూపొందించే ముందు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, డివైఎస్‌వో సుధీర్‌రెడ్డి, మండల అధికారులు, సర్పంచ్ గోపాల్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూలై 25(ప్రజా జ్యోతి ప్రతినిధి): కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన సేకరించి నిర్దేశిత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు 84 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని తెలిపారు.గతంలో నిర్వహించిన గ్రామాల్లో రీ-సర్వే పనులను వేగవంతం చేయడంతో పాటు,లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.అలాగే కుల,ఆదాయ,నివాస





ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జిల్లాలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసిన నేపథ్యంలో,ఇంకా ఫారాలు సమర్పించని వారి నుంచి వాటిని మ్యాపింగ్ డేటాను సంబంధిత సూపర్వైజర్లు,బీఎల్‌వోలు మరోసారి పరిశీలించాలని ఆదేశించారు.ఆగస్టు 3లోగా డిజిటలైజేషన్ పూర్తిచేయాల్సి ఉన్నందున,వచ్చే వారం అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి, సాదాబైనామా దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు.ఎంపిక చేసిన తదితర ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్,ఆర్డీవో శ్రీనివాస రావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్,ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు మంజుల,తహసీల్దార్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ బండ తిరుమలయ్యకు ప్రత్యేక పూజలు

-ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ బండ తిరుమలయ్య స్వామి

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 25 (ప్రజా జ్యోతి): తొలి ఏకాదశి రోజున మఖ్తల్ పట్టణంలోని ఎంతో విశిష్టతగల ఆలయాలలో ఒకటైన అతి పురాతన శ్రీ బండ తిరుమలయ్య స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకోవడం వల్ల పాపాలు నశించి,స్వామివారి పరిపూర్ణ అనుగ్రహం లభిస్తుందని విద్వాన్ కె. రాఘవేంద్ర చార్యులు తెలిపారు. శనివారం ఆషాడ తొలి ఏకాదశి పురస్కరించుకొని నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణంలోని ఖానాపురం రోడ్డు సమీపంలో తిరుమలయ్య చెరువు బీమా కెనాల్ కాలువ పక్కన కొలువైన అతి పురాతనమైన సంతాన, వివాహ కారకుడైన భక్తుల కొంగుబంగారంగా పేరొందిన స్వయంభూ శ్రీ బండ తిరుమలయ్య స్వామి దివ్య క్షేత్రంలో తెల్లవారుజామున అర్చకులు కే.రాఘ వేంద్ర చార్యులు స్వామివారికి సహస్రనామంతో తులసి అర్చన,విశేష పంచామృతాభిషేకాలతో పాటు పుష్పార్చన,ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళారతి ఇవ్వడం జరిగింది.

అనంతరం చాతుర్మాస్య ప్రారంభం సందర్భంగా చతుర్వేద పారాయణం అనంతరం ఉదయం 7 గంటల నుండి భక్తులకు స్వామివారి స్పర్శ దర్శనం కల్పించడం జరిగింది. పూర్వం నాటి నుండి శ్రీ బండ తిరుమలయ్య స్వామి సమీపంలో గల చెరువుకు తిరుమలయ్య చెరువుగా పేరుగాంచింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఉడుపి పేజావర మఠం తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ధర్మ ప్రచార కార్యదర్శి విద్వాన్ కె.రాఘవేంద్ర చార్యులు మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో ఏకాదశి అత్యంత పవిత్రమైన స్థానం ఉంది. అందులోనూ ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి లేదా దేవశయన ఏకాదశిగా భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ రోజు నుంచి శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశిస్తారని,అదే సమయంలో చాతుర్మాస దీక్షలు



ప్రారంభమవుతాయన్నారు. తొలి ఏకాదశి నాడు మనకు దగ్గరలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామిని లేదా శ్రీ మహావిష్ణువును దర్శించుకోవడం, పూజించడం ఆరాధించడం అత్యంత పుణ్యప్రదం అన్నారు. అందులో భాగంగానే మఖ్తల్ పట్టణ కేంద్రంలో అత్యంత పవిత్ర ఆలయాలలో ఒకటైన



శ్రీ బండ తిరుమలయ్య స్వామివారిని దర్శించుకోవడం వల్ల వివాహం, సంతానం కలగడంతో పాటు పాపాలు నశించి,స్వామివారి పరిపూర్ణ అనుగ్రహం లభిస్తుందని తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ బండ తిరుమలయ్య స్వామి ఆలయానికి భక్తుల రాకతో ఎంతో వైభవం సంతరించుకుందని, ఇలాంటి ఎన్నో పురాతన ఆలయాలను పునరుద్ధరణ చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు నాగప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్న సంధ్యపోగు అభిలాష్

- నీట్ విద్యార్థులకు సంఘీభావం

మహబూబ్‌నగర్, జూలై 25 (ప్రజా జ్యోతి బ్యూరో): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి



ఎస్. వినోద్ కుమార్ కుమారుడు సంధ్యపోగు అభిలాష్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొని నీట్ విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండించారు. అలాగే, నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశాల్లో పారదర్శకత, న్యాయం పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఆయుధ నైపుణ్యమే ప్రజాభద్రతకు భరోసా: ఎస్పీ సునిత రెడ్డి

- వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో అధికారులతో కలిసి పాల్గొన్న ఎస్పీ

వనపర్తి, జూలై 25 (ప్రజాజ్యోతి): ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో పోలీసులకు ఆయుధాల వినియోగంపై సంపూర్ణ నైపుణ్యం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి 10వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించిన రెండు రోజుల వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా అదనపు ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఫైరింగ్‌లో పాల్గొని ఆయుధ వినియోగ నైపుణ్యాన్ని పరీక్షించుకున్నారు. విధుల్లో వినియోగించే ఆయుధాలతో ప్రతి అధికారి, సిబ్బందికి పది రౌండ్ల ఫైరింగ్ నిర్వహించగా, అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి పోలీసు తన వద్ద ఉన్న ఆయుధాల పనితీరు, వినియోగంపై పూర్తి అవగాహనతో ఉండాలని, వాటిని ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. వ్యక్తిగత, కుటుంబ లేదా ఆరోగ్య సమస్యలను ఉన్నతాధికారుల





దృష్టికి తీసుకు రావాలని, శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి పోలీసు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, రిజర్వ్ ఎస్సై వినోద్, జిల్లా పోలీసు అధికారులు, ఎస్సైలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-మార్కెట్ యార్డులో పలు అభివృద్ధి పనులకు శంకస్థాపన

నాగర్ కర్నూల్ : 25 జులై (ప్రజా జ్యోతి) నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వ్యవసా య మార్కెట్‌యార్డులో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మార్కెట్ యార్డు ఆవరణలో కవర్ షెడ్,సి.సి. పేవ్‌మెంట్, చైర్మన్ చాంబర్,సమావేశ భవనం నిర్మాణ పనుల కు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.రాజేష్ రెడ్డి మాట్లాడుతూ,రైతులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.వ్యవసాయ మార్కెట్‌లో మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సౌకర్యవంతంగా విక్రయించే అవకాశం లభిస్తుందని,మార్కెట్‌కు వచ్చే రైతులు,వ్యాపారులు మరియు సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల సంక్షేమం,వ్యవసాయ రంగం అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రమణ రావు,మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య , డైరెక్టర్లు,ప్రతినిధులు,మార్కెట్ కమిటీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు,అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,రైతులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పరిశుభ్రకు చిరు వ్యాపారుల సహకారం అవసరం

**– పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**





**పరకాల, జూలై 25, (ప్రజా జ్యోతి) :** పరకాల పట్టణాన్ని పరిశుభ్రమైన పట్టణముగా తీర్చిదిద్దేందుకు చిరు వ్యాపారులు సహకరించాలి అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ మరియు చేపల మార్కెట్ ను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. అనంతరం మార్కెట్ పరిసర ప్రాంతాలను పర్యటించి, చిరు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మిగిలిపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. మార్కెట్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, లైటింగ్ సిస్టం ను ఏర్పాటు చేస్తామని అన్నారు. చేపల మార్కెట్ బయట ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వీరికి నిర్దిష్టమైన ప్రదేశంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపై చెత్త వేస్తే పెనాల్టీ విధిస్తామని అన్నారు. చిరు వ్యాపారం చేసుకునే వారికి వారి యొక్క జీవనదారం కోల్పోకుండా ప్రత్యామ్నాయంగా నిర్దిష్టమైన ప్రదేశం కేటాయిస్తామని అన్నారు. అలాగే పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి,ప్రజల సహకారంతోనే పరకాల పట్టణ అభివృద్ధి సాధ్యం,గత పాలకుల వైఖరి వల్ల నిరాధారణకు గురైంది అన్నారు.

## ఏటూరునాగారంలో ఘనంగా శనివారం వారాంతపు సంత ప్రారంభం





**ఏటూరు నాగారం జూలై 25 ప్రజాజ్యోతి :** ఏటూరు నాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల చిర కాల స్వప్నం నెరవేరుతూ, తొలి ఏకాదశిని పురస్కరిం చుకుని ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంత అధికారి కంగా ప్రారంభమైంది. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ఈ సంతను ఘనంగా ప్రారంభించారు.గ్రామపంచాయతీ కార్యాలయం నుండి కూరగాయల మార్కెట్ మీదుగా, బోద్రాయి వరకు మరియు బోద్రాయి నుండి చేపల మార్కెట్ వరకు ఈ సంత నిర్వహిం చబడుతుంది సర్పంచ్ తెలపడం జరిగింది. ఈ ప్రారంభో త్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, రైతులు, వ్యాపారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు డాక్టర్ వరప్రసాద్. పెండ్యాల ప్రభాకర్. సప్పిడి రామ్ నర్సయ్య. కర్రి రవీందర్. ఉప సర్పంచ్ లాలయ్య. వార్డు సభ్యులు మదరీ. మధు. నూనావత్ కిరణ్. ఉమ్మగాని రమేష్. ఎంపెల్లి రాజు. తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై ఆందోళన

**– కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**
**– తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్**



**హసన్‌పర్తి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** నీట్ ప్రశ్నప త్రం లీకేజీ వ్యవహారానికి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. హసన్ పర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ జేఏసీ మండల అధ్యక్షుడు అనుమాండ్ల విద్యాసాగర్ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని అన్నారు. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. దీనిపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రశ్నపత్రం లీకేజీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు చేపడుతున్న ఆందోళనలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జి, జలఫిరంగులు, భాష్పవాయువు ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై దేశద్రోహం వంటి ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు గరిగె మురళి, పోతరాజు చిన్నస్వామి, మేకల ప్రభాకర్, మేకల శోభన్‌బాబు, ఉద్యమ గాయకుడు గొనెల శివకుమార్, గుడాటి ముఖేష్, కుక్కల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల్లో ర్యాగింగ్ తీవ్రమైన నేరం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె.జీవన్ కుమార్**



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, జూలై 25 :** శనివారం రోజున భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లీగల్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె జీవన్ కుమార్ హాజరై మాట్లాడుతూ, కళాశాలలో ర్యాగింగ్ అనేది తీరైన నేరం. విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడి వారి యొక్క ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. అలాగే విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ చీఫ్ లీగల్ హెయిర్ డిఫెన్స్ కౌన్సిలర్ అక్షయ పాల్గొని విద్యార్థులకు న్యాయపరమైన చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ర్యాగింగ్ అరికట్టడం కోసం తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలు నాయక్, ఎన్.ఎ.స్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. రాజు మరియు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలతో అధిక ఆదాయం

- వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి
- ఐనవోలులో పంటలను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూలై 25, (ప్రజా జ్యోతి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శనివారం ఐనవోలు మండలం సింగారం, పున్నేలు గ్రామాల్లో పర్యటించిన ఆమె రైతులు సాగు చేస్తున్న పెసర, ఆయిల్‌పామ్, మామిడి తోటలను పరిశీలించారు. సింగారం గ్రామానికి చెందిన రైతు ఆకారపు పురుషోత్తం రెడ్డి మూడు ఎకరాల్లో సాగు చేస్తున్న పెసర పంటను కలెక్టర్ పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పెసర సాగు చేయడాన్ని అభినందించారు. రైతులతో మాట్లాడి ప్రత్యామ్నాయ పంటల సాగు, దిగుబడి, మార్కెట్ ధరల వివరాలను తెలుసుకున్నారు. పెసర, మినుములు, కందులు వంటి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందని, 60--70 రోజుల్లో దిగుబడి రావడంతో పాటు మార్కెట్లో మంచి ధర లభిస్తోందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం పున్నేలు గ్రామంలో రైతు వేల్పుల రమేష్ సాగు చేస్తున్న ఆరున్నర ఎకరాల ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. సాగు కాలం, దిగుబడి, ఆదాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు రాజారపు బాలరాజు ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన విషయాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. రైతు రవికిరణ్‌రెడ్డి సాగు చేస్తున్న మూడు ఎకరాల మామిడి తోటను సందర్శించి తోట నిర్వహణ, దిగుబడి, మార్కెటింగ్ అంశాలపై ఆరా తీశారు.

**ప్రత్యామ్నాయ పంటలే మేలు :** వరి, పత్తి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటల కంటే పెసర, మినుములు, కందులు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పచ్చజొన్న వంటి ఆరుతడి పంటలు ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ప్రయోజనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంటగా అభివర్ణించారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్న రైతులను అభినందించారు. పెసర, మినుములు, కందుల విత్తనాలను సబ్సిడీపై అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఆదిరెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**బిజెపి జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్**



**బచ్చన్నపేట జూలై 25 (ప్రజాజ్యోతి) :** బచ్చన్న పేట మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు బంగారు మహేష్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ హాజరు కావడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నీఓ ద్వారా వర్ష భావం తక్కువ నమోదు జరుగుతుందని. వర్షాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. రైతులు ఇబ్బంది పడుతున్న ప్రభుత్వం చూసి చూడనట్టు వ్యవహరిస్తుందని అన్నారు. రైతులను పట్టించుకోని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రభు త్వం ఇచ్చినటువంటి హామీలను తుంగల తొక్కి ఏ ఒక్కటీ హామీనీ నెరవేర్చకుండా తప్పించుకుంటుం దని అన్నారు.అలాగే 12 సంవత్సరాలలో నరేంద్ర మోడీ పాలనలో భారత్ ప్రపంచ దేశాలలో ఈరోజు నెంబర్ వన్‌గా నిలబడుతుందని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

**కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం :** రేపు మన హిందువుల భక్తి, మన సాంప్రదాయం, మన ధర్మానికి ప్రతికగా వెలసిన పవిత్ర క్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి ప్రతి సంవత్సరం 25 లక్షల మం దికి పైగా హిందువులు వస్తూ ఉంటారు. భక్తులకు ప్రయాణం సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదు ర్కొంటున్న సమస్యను గుర్తించి మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మల్లన్న స్వామి సన్నిధిలో నూతన రైల్వే స్టేషన్ను నిర్మించాలని నిధులు కేటాయించడం జరిగింది. ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కొమురవెల్లి రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగినది. కావున రేపు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు కిషన్ రెడ్డి కొమురవెల్లి రైల్వే స్టేషన్ ను ప్రారంభిస్తారని తెలియజేశారు. కావున ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు బల్ల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గద్దరాజు, తమ్మడపల్లి సర్పంచ్ బెజడి సిద్ధులు, జిల్లా నాయకులు దొంతుల చంద్రమౌళి, చిమ్ముల నరేందర్ రెడ్డి, భాస్కర్,వెంకటేష్,రాజశేకర్, శ్రీను,రమేష్, మరియు బూత్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు, మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఐక్య పోరాటం చారిత్రక విజయం

- **ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య శక్తుల విజయానికి నిదర్శనం**
- **విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి**
- **సోతుకు.ప్రవీణ్ కుమార్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**



**భూపాలపల్లి టౌన్, ప్రజాజ్యోతి, జూలై 25 :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజనులు సాగించిన ఐక్య, ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన గొప్ప విజయమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలపై విద్యార్థులు దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఉద్యమించారని, ఢిల్లీలో జరిగిన నిరసనలను అణచివేయడానికి లాఠీచార్జ్, టియర్ గ్యాస్ వంటి చర్యలకు పాల్పడినా విద్యార్థులు వెనక్కి తగ్గలేదని అన్నారు. చివరకు ప్రజా ఒత్తిడి, విద్యార్థుల ఐక్య ఉద్యమం ఫలితంగానే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.అయితే, రాజీనామాతోనే సమస్య ముగిసిపోయిందని భావించకూడదని అన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, చనిపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకతను తీసుకురావాలని, దేశ విద్యార్థుల భవిష్యత్తును కాపాడే విధంగా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి, యువజన సంఘాలకు, ప్రజాస్వామ్య శక్తులకు అభినందనలు తెలియజేస్తూ, దేశ విద్యా వ్యవస్థను రక్షించే ఉద్యమాలు మరింత బలోపేతం కావాలని సోతుకు. ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.

## తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

- పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా.. ఆన్ లైన్ నమోదుపై పరిశీలన
- ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిస్పాక్షిక సేవలు అందించాలని అధికారులకు ఆదేశం












**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ వార్షిక తనిఖీల్లో భాగంగా తాడ్వాయి పోలీస్ స్టేషన్ ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు.జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్శనలో ఎస్పీ మొదటగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టూ కలియ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.రోడ్డు ప్రమాద కేసులలో ఉన్న వాహనాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిసెప్షన్ అధికారితో మాట్లాడుతూ.. ఫిర్యాదు దారులతో మర్యాదగా వ్యవహరించాలని దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులలో పురోగతిని సమీక్షించారు. ఎప్పటికప్పుడు కేసులలోని దర్యాప్తును వెనువెంటనే ఆన్ లైన్ లో పొందు పరచాలని ఆదేశించారు. అనంతరం రికార్డుల నిర్వహణ విధానం,సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించారు.కేస్రికార్డులను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు.రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ,వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలందించాలని అధికారులను,సిబ్బందిని ఆదేశించారు.ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీలో ములుగు డిఎస్పీ రవీందర్, పస్ర సిఐ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటూరునాగారంలో ఘనంగా శనివారం వారాంతపు సంత ప్రారంభం





**ఏటూరు నాగారం జూలై 25 ప్రజా జ్యోతి :** ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుతూ, తొలి ఏకాదశిని పురస్కరించుకుని ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంత అధికారికంగా ప్రారంభమైంది. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ఈ సంతను ఘనంగా ప్రారంభించారు.గ్రామపంచాయతీ కార్యాలయం నుండి కూరగాయల మార్కెట్ మీదుగా, బోద్రాయి వరకు మరియు బోద్రాయి నుండి చేపల మార్కెట్ వరకు ఈ సంత నిర్వహించబడుతుంది సర్పంచ్ తెలపడం జరిగింది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, రైతులు, వ్యాపారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు డాక్టర్ వరప్రసాద్. పెండ్యాల ప్రభాకర్. సప్పిడి రామ్ నర్సయ్య. కర్రి రవీందర్.

ఉప సర్పంచ్ లాలయ్య. వార్డు సభ్యులు మదరీ. మధు. నూనావత్ కిరణ్. ఉమ్మగాని రమేష్. ఎంపెల్లి రాజు. తదితరులు పాల్గొన్నారు.

## సోమారం గ్రామంలో ఘనంగా హరితహారం - వనమహోత్సవం

**జిల్లా సివిల్ సప్లై ఆధ్వర్యంలో మొక్కలు నాటిన అధికారులు**



**పర్వతగిరి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన హరితహారం, వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ సూచన మేరకు వరంగల్ జిల్లా సివిల్ సప్లై శాఖకు కేటాయించిన మొక్కల నాటే కార్యక్రమాన్ని పర్వతగిరి మండలం సోమారం గ్రామంలోని వినాయక రైస్ మిల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్, స్థానిక సర్పంచ్ వేల్పుల శ్రీనివాస్, మండల తహసీల్దార్ వెంకటస్వామి కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. హరితహారం, వనమహోత్సవ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం పచ్చదనాన్ని పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక రైస్ మిల్ యజమాని ధర్మిని యాకాంబరం, స్థానిక జీపీఓ జి. సారంగపాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మమత, రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు గడ్డం బాబు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దర్గా తలనీలాల అవినీతిపై విచారణ ఎక్కడ?

- అవకతవకలకు పాల్పడిన వారిని కాపాడింది ఎవరు?
- బాధ్యులపై చర్యలు ఎందుకు లేవు?
- తిరిగి సమగ్ర విచారణ చేపట్టి నిధులు రికవరీ చేయాలి
- స్వేరోస్ జిల్లా అధికార ప్రతినిధి గారె జయరాజ్ డిమాండ్



**పర్వతగిరి, జులై 25 (ప్రజా జ్యోతి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ దర్గాలో తలనీ లాల విక్రయాలు జరిగినట్లు గతంలో వెలుగుచూసిన అవి నీతి ఆరోపణలపై ఇప్పటివరకు ఎలాంటి సమగ్ర విచారణ చేపట్టకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం పట్ల స్వేరోస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి గారె జయరాజ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో, గతంలో పలు పత్రికల్లో తలనీలాల విక్రయాల్లో లక్షల రూపాయల మేర అవకతవకలు జరిగినట్లు కథనాలు వెలువడినా, సంబంధిత అధికారులు ఇప్పటి వరకు ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించే తలనీలాల విషయంలో అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చినప్పటికీ, వాటిపై ఎలాంటి చర్యలు లేకపోవడం వెనుక కారణం ఏమిటని ఆయన ప్రశ్నించారు. విచారణ లేకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ వ్యవహారంలో పెద్దస్థాయి వ్యక్తుల ప్రమేయం ఉందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు మౌనం వీడి పూర్తి వివరాలను వెల్లడించాలని జయరాజ్ డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన ఆరోపణలపై స్వతంత్రంగా, పారదర్శకంగా సమగ్ర విచారణ జరిపించి, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా నష్టపోయిన నిధులను పూర్తిగా రికవరీ చేసి ప్రజలకు నివేదిక విడుదల చేయాలని ఆయన కోరారు. దర్గా ఆదాయాలు, తలనీలాల వేలం ప్రక్రియ, లెక్కల నిర్వహణపై కూడా ప్రత్యేక ఆడిట్ నిర్వహించి వాస్తవాలను బహిర్గతం చేయాలని జయరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికే దర్గా తలనీలాల టెండర్..? :** మండలంలోని అన్నారం గ్రామంలోని ప్రముఖ ముస్లిం పుణ్యక్షేత్రం హజ్రత్ యాకూబ్ షా వలి బాబా దర్గా తలనీలాల టెండర్ వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. గత రెండు సంవత్సరాల కాలంలో సుమారు రూ.60 లక్షల విలువైన తలనీలాలను అక్రమంగా సేకరించి విక్రయించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికే 2026 నుంచి మూడు సంవత్సరాల టెండర్ కేటాయించడం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు, మైనార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. అందిన వివరాల ప్రకారం, దర్గా తలనీలాల సేకరణ హక్కులను సాధారణంగా వక్ఫ్ బోర్డు అధికారులు బహిరంగ వేలం ద్వారా కేటాయిస్తారు. అయితే గత రెండేళ్లుగా అన్నారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఎలాంటి అధికారిక టెండర్ లేకుండానే తలనీలాలను సేకరించి విక్రయించాడని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.60 లక్షల విలువైన తలనీలాలు మాయమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు జిల్లా మైనారిటీ శాఖ విచారణ నిర్వహించినట్లు సమాచారం. విచారణలో అక్రమాలు జరిగినట్లు నివేదికను వక్ఫ్ బోర్డుకు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ రియాజ్, దర్గా సూపరింటెండెంట్ ముంతాజ్ హుస్సేన్ కూడా గత రెండు సంవత్సరాల తలనీలాలను ఓ వ్యక్తి తీసుకున్నట్లు రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓకు రాతపూర్వక నివేదిక అందించినట్లు పేర్కొంటున్నారు. అయితే, ఈ ఆరోపణలు, విచారణ నివేదికలు ఉన్నప్పటికీ అదే వ్యక్తికి 2026 నుంచి మూడు సంవత్సరాలపాటు తలనీలాల టెండర్ కేటాయించడం తీవ్ర వివాదానికి కారణమైంది. బహిరంగ వేలం నిర్వహించకుండా టెండర్ ఇవ్వడం వెనుక కారణాలేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మైనార్టీల ఆస్తులు, ఆదాయానికి సంబంధించిన అంశాల్లో పారదర్శకత పాటించాల్సిన అధికారులు ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల వక్ఫ్ బోర్డు ప్రతిష్ఠ దెబ్బతింటోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, తెలంగాణ వక్ఫ్ బోర్డు సీఈఓ, వక్ఫ్ బోర్డు చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, గత రెండేళ్లలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న రూ.60 లక్షల నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని, ప్రస్తుతం కేటాయించిన టెండర్‌ను రద్దు చేసి పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని ముస్లిం మైనార్టీ నాయకులు, గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఆరుతడి పంటల సాగుతోనే రైతుకు భరోసా

### కెవికె శాస్త్రవేత్త కిరణ్

గరిడేపల్లి,జూలై 25(ప్రజా జ్యోతి): ఆరుతడి పంటల సాగుతోనే రైతుకు భరోసా అని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎ.కిరణ్ సూచించారు.శనివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు వర్షాభా వం తీవ్రత పెరిగే అవకాశం ఉంద ని ఎల్–నినో ప్రభావం యాసంగి సీజన్ వరకు కొనసాగవచ్చని తెలిపారు.జిల్లాలోని 23 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు.భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బోరుబావుల కింద వరి సాగును తగ్గించి,ఆరుతడి పంటల సాగును రైతులు ప్రోత్సహించాలని అన్నారు.వరి,పత్తి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా పప్పుధాన్యాలు,చిరుధాన్యాలు,నూనె గింజలు,కూరగాయలు,ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ కటికం వేణు,ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎ.నరేష్,వ్యవసాయ విస్తరణ అధికారి మనోజ్ కుమార్, చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సి టీ విద్యార్థులు రితిక, స్నేహవల్లి,సుచరిత,అనూష,వినయ శ్రీ, దివ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## గడ్డం మైక్ భద్రయ్య మృతి బాధాకరం

నడిగూడెం, జులై 25 ,ప్రజా జ్యోతి: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తిరుపతమ్మ సుధీర్. గ్రామానికి చెందిన గడ్డం మైక్ భద్రయ్య మృతి బాధాకరమని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్



వేపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు మండల కేంద్రం ని చెందిన గడ్డం మైకు భద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందిన భద్ర అమృతదేహం పై పూలమాల వేసింది వాళ్ళ అర్పించారు తన వృత్తిగా మైకులను పెళ్లిలకు ఇతర శుభకార్యాలకు పెడుతూ ఎంతోమందికి మైకు భద్రయ్య గా అందరి నోట ఆప్యాయతగా పలకరిస్తూ ఉంటారని పేద కుటుంబానికి చెందిన భద్రయ్య కుటుంబానికి అందరూ అండగా ఉండాలని కోరారు అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గడ్డంనారాయణ గడ్డం మల్లేష్ కొమరయ్య శ్రీను నాగరాజు గోపి రిక్కీ విజయ్ వెంకన్న గ్రామస్తులు తదితరులు నివాళులర్పించారు.

## తొలి ఏకాదశి వేళ రామాలయంలో భక్తిశ్రద్ధ లతో ప్రత్యేక పూజలు చేసిన మహిళలు

తుంగతుర్తి, జులై 25,(ప్రజా జ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని రామాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు



జాము నుంచే ఆలయానికి చేరుకున్న మహిళలు శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, విష్ణు సహస్ర పారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు వైభవంగా సాగాయి. మహిళలు కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## చట్టం ఎవరికి చుట్టము కాదు

### హుజూర్ నగర్ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప

హుజూర్ నగర్ జూలై 25 (ప్రజా జ్యోతి): నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్షార్హులేనని చట్టం ఎవరికి చుట్టము కాదని హుజూర్ నగర్ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఒక చట్టాన్ని రూపొందించినప్పుడు అందులో పౌరుల హక్కులు విధుల గురించి పేర్కొనబడుతుందని ఆ చట్టంలో ఉండే అన్ని విషయాలు పౌరులకు తెలిసినట్లుగానే భావించాలని కూడా చట్టంలో పొందుపరచబడి




ఉంటుందని అందువల్ల ఇది నేరం అని తెలియక తాము తప్పు చేశాము అంటే చట్టం మౌనంగా ఉండజాలదన్నారు. విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి డ్రగ్స్ ను కలిగి ఉండటానికి దూరంగా ఉండాలని అలాగే సాంకేతికతను సన్మార్గానికి వినియోగించాలి తప్పు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వినియోగించినట్లయితే శిక్షించబడతారన్నారు. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే యావజ్జీవ కారాగార శిక్ష మరియు మరణ శిక్ష సైతం విధించే అవకాశం ఉన్న పోక్సో, నిర్భయ లాంటి కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని అందువల్ల విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ఆమె సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు ఆమె సూచించారు. కళాశాలలలో, విద్యా సంస్థలలో ర్యాగింగ్ కు పాల్పడిన వారికి 3 సంవత్సరముల జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని అందువల్ల ఏ ఒక్కరు ర్యాగింగ్ కు పాల్పడ వద్దని ఆమె విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాల డ్రగ్స్ రహిత కళాశాలగా రూపొందించిన పోస్టర్ ను న్యాయమూర్తి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సోమపంగు రామారావు,న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, ఎస్ఐ హనుమా నాయక్, సిబ్బంది,పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి – శయన ఏకాదశి విశిష్టత

శాలిగౌరారం జులై 25 .ప్రజా జ్యోతి హిందూ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన పర్వదినాల్లో తొలి ఏకాదశికి ప్రత్యేక స్థానం ఉంది. ఆషాఢ మాస శుక్లపక్ష ఏకాదశిని తొలి ఏకాదశి, శయన ఏకాదశి అని పిలుస్తారు. ఈ రోజున శ్రీమహావిష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి ప్రవేశిస్తా డని భక్తుల విశ్వాసం. తిరిగి నాలుగు నెలల అనంతరం కార్తీక శుద్ధ ఏకాదశి రోజున స్వామివారు మేల్కొంటారని, ఆ రోజును ఉత్థాన ఏకాదశిగా పిలుస్తారని పురాణాలు చెబుతున్నాయి. అనంతరం వచ్చే ద్వాదశిని క్షీరాబ్ధి ద్వాదశిగా జరుపు కుంటారు.

ఏడాదిలో మొత్తం 24 ఏకాదశులు వస్తాయి. ప్రతి నెల శుక్లపక్షంలో ఒకటి, కృష్ణపక్షంలో మరొకటి చొప్పున రెండు ఏకాదశులు ఉంటాయి. 'ఏకాదశి' అంటే పదకొండు అని అర్థం. మనిషికి ఉన్న ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, వాటిని నియంత్రించే మనస్సు కలిపి పదకొండు ఇంద్రియాలుగా భావిస్తారు. ఈ పదకొండు ఏకాగ్రతతో పనిచేసే రోజే ఏకాదశిగా ఆధ్యాత్మికంగా భావిస్తారు.

### ఎందుకు జరుపుకుంటారు?

తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, శ్రీహరి అయిన లక్ష్మీనారాయణ స్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం. స్వామివారు యోగనిద్రలోకి ప్రవేశించే రోజు కావడంతో దీనిని



శయన ఏకాదశి అని కూడా అంటారు. ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేసి, మరుసటి రోజు ద్వాదశి పారణ సమయంలో శ్రీమహావిష్ణువును పూజించి తీర్థప్రసా దాలు స్వీకరించడం ఆనవాయితీగా వస్తోంది.

తొలి ఏకాదశిని రైతులు కూడా ప్రత్యేకంగా జరుపుకుంటారు. పంటలకు ఎలాంటి తెగుళ్లు సోకకుండా, అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించ కుండా, పంటలు సమృద్ధిగా పండాలని శ్రీహరిని ప్రార్థిస్తారు. ఈ మాసంలో బోనాలు, పశుపూజ, శకట ఆరాధనలు వంటి సంప్రదాయ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు.

### పూజా విధానం

తొలి ఏకాదశి రోజున భక్తులు సూర్యోదయానికి ముందే నిద్రలేచి శుచిగా స్నానం చేసి శ్రీమహావిష్ణువును పూజిస్తారు. పూజా మందిరాన్ని శుభ్రం చేసి విష్ణుమూర్తి విగ్రహానికి లేదా చిత్రపటానికి పసుపు, కుంకుమలు సమర్పించి పుష్పాలతో అలంకరిస్తారు. అనంతరం నైవేద్యం సమర్పించి కర్పూర హారతి ఇస్తారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న పేలాలను మెత్తగా దంచి, అందులో బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీగా ఉంది. ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేసి, మరుసటి రోజు ద్వాదశి నాడు శ్రీహరిని పూజించిన అనంతరం పారణ చేయడం వ్రతాచర ణలో భాగంగా భావిస్తారు.

### వ్రత నియమాలు

ఏకాదశి వ్రతాన్ని ఆచరించే భక్తులు అసత్యం పలకకుండా, చెడు ఆలోచనలు, దుష్కార్యాలకు దూరంగా ఉండాలని పెద్దలు సూచిస్తారు. మాంసాహారం, కొన్ని ధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి ఆహార పదార్థాలను ఈ రోజున తీసుకోకుండా ఉపవాసం లేదా నియమబద్ధమైన ఆహారాన్ని స్వీకరిస్తారు. అయితే ఆరోగ్య పరిస్థితులను బట్టి ఉపవాస నియమాలను పాటించాలని ఆధ్యాత్మిక పండితులు సూచిస్తున్నారు.

### చాతుర్మాస్య వ్రతం

తొలి ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించే సంప్రదాయం ఉంది. ఈ కాలాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు శాకాహారం, ఉపవాసం, పూజలు, దానధర్మాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఏకాదశి రోజున ఉపవాసం చేసి, మరుసటి రోజు ద్వాదశి పారణ అనంతరం ప్రసాదాన్ని స్వీకరించడం ద్వారా వ్రతాన్ని ఆచరిస్తారు.

పద్మ పురాణం తదితర పురాణాల్లో ఏకాదశి వ్రత మహిమను విశేషంగా వివరించినట్లు పండితులు పేర్కొంటున్నారు. ఈ పవిత్రమైన రోజున భక్తిశ్రద్ధలతో శ్రీమహావిష్ణువును ఆరాధించడం, అన్నదానం చేయడం, దానధర్మాలు నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమని భక్తుల విశ్వాసం.

**– వల్లాల వావిలాల రామలింగయ్య శర్మ**
**వల్లాల గ్రామం. శాలిగౌరారం మండలం**

## బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి బాధ్యతతో పనిచేయాలి: తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, జూలై 25,(ప్రజా జ్యోతి): మండలంలోని 46 పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ



సీతయ్య పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించారు. శనివారం పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ, బూత్ లెవెల్ అధికారులకు సహకరిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే కొన్ని పోలింగ్ బూత్‌లలో 100 శాతం ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన గొట్టిపర్తి, వెలుగుపల్లి, తుంగతుర్తి, వెంపటి, అన్నారం లాంటి ప్రధాన గ్రామాలతో పాటు కొత్తగూడెం, తూర్పుగూడెం, సంగెం తదితర గ్రామాల్లో గ్రామ ముఖ్య నాయకులతో సమన్వయం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించాలని సూచించారు. అదేవిధంగా చనిపోయిన వారి పేర్లు, డబుల్ ఓట్లు, మార్పిడి ఓట్లు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఎల్ఏలకు సూచించారు. ప్రతి ఓటరు వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గుండగాని రాములు గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, బూత్ లెవెల్ ఏజెంట్లు సింహాద్రి, కర్ణాకర్, రాములు, చిట్టి, సమ్మద్, మహేందర్, భాస్కర్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

### – మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

హాలియా,జూలై25(ప్రజా జ్యోతి) ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుఅత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటరు జాబితాలో చోటు కల్పించేలా ఓటరు జాబితా సవరణ



ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా నిర్దేశిత సమయానికే పూర్తి చేయాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పిలుపుని చ్చారు.శనివారం హాలియా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు,బిఎల్ఓలు వివిధ రాజకీయ పార్టీల బిఎల్ఏలు పాల్గొన్నారు.జాబితా సవరణ విధానాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. నూతన ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు,చిరునామాల్లో మార్పులు,పేర్లలోని తప్పుల సవరణలు,మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి కీలక అంశాలను భారత ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలకు లోబడి,అత్యంత పారదర్శకంగా,వేగవంతంగా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సవరణ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. బిఎల్ఓలు,బిఎల్ఏలు సమన్వయంతో వ్యవహరిస్తూ, నిర్ణీత గడువులోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## విద్యార్థుల అభ్యసనలో మార్పే శిక్షణ లక్ష్యం

### పర్యావరణ పరిరక్షణకు గరిడేపల్లి గురువుల ఆదర్శం

### ఎంఈఓ ఛత్రు నాయక్

గరిడేపల్లి,జూలై 25(ప్రజా జ్యోతి): విద్యార్థుల అభ్యసనలో స్పష్టమైన మార్పు తీసుకురావడమే ఉపాధ్యాయ శిక్షణల ప్రధాన ఉద్దేశమని మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ అన్నారు.గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఉపాధ్యా



యులకు మూడు రోజులపాటు నిర్వహించిన వృత్త్యంతర శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. మూడో రోజు శిక్షణను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడు తూ పునాది అభ్యసనలో,ముఖ్యంగా గణిత సామర్థ్యాల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి,వారికి రెమిడీయల్ బోధనను సమర్థవంతంగా అందించడం ద్వారా అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని సూచించారు.శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులు,కార్యకలాపాలను ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల స్థాయిలో సమర్థంగా అమలు చేసి విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు.రిసోర్స్ పర్సన్లు రవీందర్, నాగయ్య, పాపయ్య,రాం బాబు పునాది అభ్యసనలో గణిత సామర్థ్యాల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం రూపొందించిన రెమిడీయేషన్ కార్యక్రమంపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఆసక్తిగా పాల్గొని బోధనా విధానాలపై అవగాహన పెంపొందించుకున్నా రు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా గరిడేపల్లి మండల ఉపాధ్యాయులు ఆదర్శ నిర్ణయం తీసుకున్నారు. వృత్త్యంతర శిక్షణ కార్యక్రమాల్లో పేపర్ ప్లేట్ల వినియోగాన్ని పూర్తిగా నివారించి, స్టీల్ ప్లేట్లను ఉపయోగిస్తూ పర్యావరణ హిత జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు.ఉపాధ్యాయుల ఈ చిన్న ప్రయత్నం సమాజానికి



గొప్ప సందేశాన్ని అందిస్తోందని మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ అభినందించా రు.ఈ శిక్షణ లో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయురాల్లు,సీఆర్పీలు ఆర్. రామకృష్ణ,ఈ.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా ఒక మొక్క.. పర్యావరణానికి రక్ష

### సర్పంచ్ నిరంజన్ గౌడ్

చౌటుప్పల్, జులై 25 ( ప్రజా జ్యోతి ): ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షిస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని దండు మల్కాపురం గ్రామ సర్పంచ్ గిర్కటి



నిరంజన్ గౌడ్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్ద చెరువు వద్ద ఈత మొక్కలు నాటారు. గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఈత మొక్కలు ఔషధపరంగా కూడా ఎంతో ఉపయోగకరమని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మీసాల నరసింహ, ఎక్సైజ్ సీఐ బాలాజీ నాయక్, ఎస్సై శంకర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్వాయి రమాదేవి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎన్నారం, మునిపంపుల పాఠశాలలో ప్రత్యేక న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు

### నిర్వహించిన రామన్నపేట మండల న్యాయ సేవ అధికార సంస్థ

### ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జ్ శిరీష, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ రత్నకుమారి.

రామన్నపేట, జూలై 25(ప్రజా జ్యోతి): మండల పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా అన్ని రంగాలలో ముందు ఉండాలన్నారు. విద్యా వ్యవస్థ వల్లనే ప్రపంచాన్ని మార్చే అవకాశం ఉంటది. విద్యార్థులకి ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. అందరికీ పలు రకాల చట్టాలపై అవగాహన పొందాలని, విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, లేబర్ చట్టాలు, మాదక ద్రవ్యాలు, అన్ని రకాలుగా ఎలాంటి సమస్య వచ్చిన చట్టాలపై అవగాహన పెంచుకోవా లన్నారు. విద్యార్థులకి పాఠశాలలో గాని, వచ్చి వెళ్ళే దారిలో ఆకతాయిల వల్ల గాని ఏమైనా సమస్య అనిపించిన వెంటనే పాఠశాలలో ఏర్పాటు చేసిన చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్ లలో గానీ, మండల



స్థాయిలో ఉన్న న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి గాని తీసుకురావాలని, ఎవరు కూడా అధైర్య పడవద్దని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి వేరే బయటి ఆలోచనలు పెట్టుకోకుండా, పుస్తకాలు చదవడం మీదనే దృష్టి పెట్టాలి, చెడు దారి పట్టించే ఆలోచనలు పక్కకి నెట్టేసి, ఏమి ఆలోచనలు చేసిన మంచి నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలని అన్నారు. సమాజం పట్ల మంచి అవగాహనతో ఉండాలన్నారు. సమాజంలో మన హక్కులు, బాధ్యతలు నిర్వహణలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎంఏ మజీద్, యాదాస్ యాదయ్య, కునూరు శ్రీనివాస్, పాల్వంచ జగతయ్య నూతి రమేష్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు , పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దచెల్మెడ పాఠశాలకు రూ.1.62 కోట్ల వరం

◇ నూతన భవన నిర్మాణానికి మంత్రి దామోదర చొరవ
◇ చిత్రపటానికి పాలాభిషేకంతో గ్రామస్తుల కృతజ్ఞతలు



అందోల్, (ప్రజాజ్యోతి): అందోల్ నియోజకవర్గ పరిధిలోని మునిపల్లి మండలం పెద్దచెల్మెడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన భవన నిర్మాణం కోసం రూ.1.62 కోట్లు మంజూరు కావడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలుపుతూ మండల కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. కొత్త పాఠశాల భవనం నిర్మాణంతో విద్యార్థులకు సౌకర్యవంతమైన తరగతి గదులు అందుబాటులోకి రావడంతో పాటు విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. పెద్దచెల్మెడ పాఠశాలకు నిధులు మంజూరు చేయించిన మంత్రి దామోదర రాజనర్సింహకు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూరి సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిల్లోడి సతీష్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి పటేల్, మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, సీనియర్ నాయకుడు సంగన్న, గ్రామ సర్పంచ్ రాధాబాయి జోషి, గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు ఇస్మాయిల్, ఉప సర్పంచ్‌లు అడ్డు పటేల్, ఆనంద్, హెడ్‌మాస్టర్ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వాణి, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొని మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

### శివంపేటలో రూ.1 కోటి

# వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం

◇ హెచ్ఎండీఏ నిధులతో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు



అందోల్, (ప్రజాజ్యోతి): గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. చౌట్కూరు మండలంలోని శివంపేట గ్రామంలో హెచ్ఎండీఏ నిధులతో మంజూరైన రూ.1 కోటి వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను శనివారం ప్రజాప్రతినిధులు ఘనంగా ప్రారంభించారు. ఈ పనులతో గ్రామంలో రహదారులు, మురుగు నీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చౌటకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నత్తి దశరథ్, గ్రామ సర్పంచ్ సంధ్యా మల్లికార్జున్ గౌడ్, ఉపసర్పంచ్ నత్తి సందీప్ కుమార్, గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, మండల నాయకులు ఈశ్వర్ గౌడ్, గోవర్ధన్, శివకుమార్, జైపాల్ రెడ్డి, చక్రియాల సర్పంచ్ అనసూయ రాజశేఖర్, ఎస్సీ సెల్ చైర్మన్ కోడూరు రామస్వామి, బోర్వెల్ నరసింహారెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువత పోరాటమే గెలిచింది

◇ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాపై మంత్రి దామోదర స్పందన
◇ పారదర్శక పరీక్షా వ్యవస్థకు ఇదే ఆరంభం కావాలని ఆకాంక్ష



అందోల్, (ప్రజాజ్యోతి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత, విద్యార్థులు సాధించిన ప్రజాస్వామ్య విజయమని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. నీట్ పరీక్ష వివాదం నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత చేపట్టిన ఉద్యమం ఫలితమే ఈ పరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందించిన మంత్రి దామోదర, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా నిజం, న్యాయం, జవాబుదారీతనం కోసం లక్షలాది మంది విద్యార్థులు సాగించిన అలుపెరగని పోరాటానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం వారికి అండగా నిలిచి, వారి గొంతుకను పార్లమెంట్‌లోపల, బయట బలంగా వినిపిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నించిన ప్రతిపక్షాల పాత్రను ఆయన అభినందించారు. అయితే రాజీనామాతోనే సమస్య ముగిసిపోకూడదని, దేశంలోని ప్రతి విద్యార్థి విశ్వాసాన్ని పొందేలా పారదర్శకమైన, విశ్వసనీయమైన, ప్రతిభకు న్యాయం చేసే పరీక్షా వ్యవస్థను నిర్మించేందుకు సమగ్ర సంస్కరణలు చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. "యువత న్యాయం కోసం ఏకమైతే... ప్రజాస్వామ్యం తప్పక స్పందిస్తుంది" అని పేర్కొంటూ విద్యార్థుల ఉద్యమానికి ఆయన సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు నాంది కావాలని ఆకాంక్షించారు.

### ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌ను

# కలిసిన టీఎన్‌జీఓ నూతన కార్యవర్గం





నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25: నారాయణ ఖేడ్ తెలంగాణ ఎన్జీవోల సంఘం టీఎన్‌జీఓ నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.డి. మిస్కిన్, ప్రధాన కార్యదర్శి పి. దత్తు, సహాయ కార్యదర్శి కె. రవీందర్, ఖజాంచి జెట్ల భాస్కర్, ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్, ఎస్. శ్రీనివాసులు, రజిత, సాయన్న, సంయుక్త కార్యదర్శులు అరుణ్, రాజ్ కుమార్, విట్టవ్వ, నిర్వహణ కార్యదర్శి ముజమ్మిల్, ప్రచార కార్యదర్శి రుక్మారెడ్డి, కార్యవర్గ సభ్యులు నాగలక్ష్మి, లక్ష్మణ్ కుమార్, పండరీ, సూర్యకాంత్, ప్రవీణ్, రాజు నాయక్, నిర్మల రాథోడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై నిర్బంధం ప్రజాస్వామ్యానికి మచ్చ: మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి

◇ నీట్ ఉద్యమానికి జోగిపేట కాంగ్రెస్ నాయకుల సంఘీభావం
◇ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ ధర్నా ◇ కేంద్రంపై విమర్శల వెల్లువ







అందోల్, (ప్రజాజ్యోతి): ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికగా నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు జోగిపేట నుంచి కాంగ్రెస్ పార్టీ సంఘీభావం ప్రకటించింది. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో జోగిపేట పట్టణ ప్రధాన రహదారిపై శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా సందర్భంగా "నీట్ విద్యార్థులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి", "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి", "ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి", "రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ నినాదాలతో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసించారు. ఈ సందర్భంగా అందోల్--జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై న్యాయం కోరుతూ విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం, నిర్బంధాలకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల ఉద్యమానికి పార్టీలకు అతీతంగా దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని, కేంద్ర ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను వీడి విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించాలని కోరారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మరో నాయకుడు కాంగ్రెస్ పార్టీ అందోల్ మండల అధ్యక్షుడు శివరాజ్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తప్పించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్ జిల్లా నాయకులు డాకూరి వెంకటేశం, కౌన్సిలర్ కోశికే రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల ప్రవీణ్, కోరబోయిన నాగరాజు(నాని), తుపాకుల సునీల్, గొల్ల శరత్ బాబు, కో ఆప్షన్ మెంబెర్స్ జీషాన్, ప్రవీణ్, ఆత్మ కమిటీ సభ్యుడు ఖలీద్, నాయకులు శేరి వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, డాకూరి శ్రీనివాస్, చింతకుంట శివ, బేగరి అనిల్, సైలాన్, గోహేర్ అలీ, కొత్త శ్రీశైలం, ఆకుల నందు, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, పృథ్విరెడ్డి, చోటు, తేజగౌడ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో ఎస్ఐఓ భారీ నిరసన, ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక

◇ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం సహించరాదు"






జహీరాబాద్, జూలై 24 (ప్రజా జ్యోతి న్యూస్) నీట్ పేపర్ లీక్ మరియు విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల నేపథ్యంలో, నిరసన చేస్తున్న విద్యార్థులకు పూర్తి సంఘీభావం తెలుపుతూ స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) జహీరాబాద్, బాగారెడ్డి స్టేడియం నుండి ర్యాలీని ప్రారంభించింది. ఈ ర్యాలీ బ్లాక్ రోడ్, డిగ్రీ కాలేజ్ రోడ్, నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగి, అంబేద్కర్ విగ్రహం సమీపంలోని జాతీయ రహదారి 65 వద్ద ముగిసింది. నిరసనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నీట్ పేపర్ లీక్ విషయంపై నిష్పక్షపాత విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మీడియాతో మాట్లాడుతూ, నెట్ పేపర్ లీక్ వంటి తీవ్రమైన సంఘటనలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేశాయని, దీనిపై ప్రభుత్వ మౌనం అత్యంత విచారకరమని ఎస్ఐఓ జిల్లా సంగారెడ్డి అధ్యక్షుడు మహమ్మద్ ఫసిహుద్దీన్ అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ చట్టబద్ధమైన హక్కుల కోసం వీధుల్లోకి రావాల్సి వస్తోందని ఆయన అన్నారు. అందువల్ల, ప్రభుత్వం వారి డిమాండ్లను తీవ్రంగా పరిగణించి, తక్షణమే ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నెట్‌పేపర్ లీక్‌పై పూర్తి, పారదర్శక, నిష్పాక్షిక విచారణ జరపాలని, ఈ కుంభకోణంలో పాలుపడిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన, సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యార్థులలో విశ్వాసాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నిరసనకారులపై జరిగిన లాఠీఛార్జ్ అప్రజా స్వామికమని, బాధితులకు న్యాయం జరిగేలా దీనిపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని ఆయన కోరారు. శాంతియుత నిరసన అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కని, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కఠిన వైఖరి అవలంబించకుండా ప్రభుత్వం వారి సమస్యలకు సరైన పరిష్కారం కను గొనాలని ఫసిహుద్దీన్ స్పష్టం చేశారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించు కోకపోతే, ఈ నిరసన ఉద్యమాన్ని దేశవ్యాప్తం గా మరింత విస్తరిస్తామని, వివిధ దశల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం తీవ్ర పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. నెట్ పేపర్ లీక్‌ను ఖండిస్తూ, పారదర్శక విద్యా వ్యవస్థను నెలకొల్పాలని నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులను పాల్గొన్నవారు చేతుల్లో పట్టుకున్నారు. ఈ ప్రదర్శన శాంతియుత వాతావరణంలో ముగిసింది. ఈ నిరసనలో ఎస్ఐఓ సభ్యులు ముహమ్మద్ అర్సలాన్, ముహమ్మద్ తల్హా, ముహమ్మద్ అద్నాన్, ముహమ్మద్ సోహైల్, ముహమ్మద్ ఎహ్తేశం, ముహమ్మద్ ఉమర్ ఫరూఖ్, ముహమ్మద్ అయాజ్, ముహమ్మద్ అయన్, సయ్యద్ ఉమైర్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూములను సర్వే చేసి అర్హులైన పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పేద కుటుంబాలు సొంత ఇల్లు, ఇంటి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గ్రామాల్లో జనాభా పెరగడం, నివాస స్థలాల కొరత కారణంగా అనేక కుటుంబాలు ఇరుకైన ప్రదేశాల్లో నివసించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని కొందరు అక్రమంగా ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి కబ్జాలను అరికట్టి, ప్రభుత్వ భూములను పరిరక్షించి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాలు, పట్టణాల్లోని ప్రభుత్వ భూములను సమగ్రంగా సర్వే చేసి పారదర్శకంగా అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు లక్ష్మణ్, సోయల్ సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరాలు లేని సమాజం కోసం పోరాడుదాం

◇ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక ఉద్యమ శిక్షణ తరగతులు నారాయణఖేడ్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంఘం జెండాను జిల్లా కార్యదర్శి పి. అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి. అశోక్ మాట్లాడుతూ.. కుల వివక్ష, అంటరానితనం, పేదరికం, నిరుద్యోగం వంటి అసమానతలను నిర్మూలించి అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ సంపదలో అధిక భాగం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించడం వల్ల అట్టడుగు వర్గాలకు అందాల్సిన సామాజిక న్యాయం దెబ్బతింటోందని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బీజేపీ పాలనలో కోటీశ్వరుల సంపద పెరిగినప్పటికీ పేదరికంలో జీవిస్తున్న వారి సంఖ్య కూడా పెరిగిందని అన్నారు. రాష్ట్రంలో కుల దురహంకార హత్యలు, సాంఘిక బహిష్కరణలు, దళితులపై దాడులు జరిగినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించడం ద్వారా పేదలు, దళితులకు విద్యను దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతో పాటు కుల వివక్ష, అంటరానితనం, అన్ని రకాల అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు కాన్షీరాం, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొఠారి నర్సింలు, న్యాయవాది సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శులు గణపతి, దాసు, జయరాం, జిల్లా నాయకులు సంతోష్, సుధాకర్, గంగారాం, మోహన్, సురేష్, ప్రవీణ్, విజయ్, దత్తా సాయి తదితరులు పాల్గొన్నారు.

### కంగ్టి ఎంపీడీఓ

# సత్యయ్యకు సన్మానం

◇ అభినందన వీడ్కోలు సభలో పాల్గొన్న ఎమ్మెల్యే









నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25: కంగ్టి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంపీడీఓ విశిష్ట సేవలందించి, ఉప ప్రధాన కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ సీఈవో పదోన్నతి పొందిన ఎం. సత్యయ్యకు కంగ్టి మండల కేంద్రంలో ఘనంగా అభినందన--వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సత్యయ్యను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ..కంగ్టి మండలంలో ఎంపీడీఓగా సత్యయ్య ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన సేవా తత్పరత, పాలనా నైపుణ్యం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఉప ప్రధాన కార్యనిర్వహణాధికారిగా పదోన్నతి పొందడం ఆనందదాయకమని, కొత్త బాధ్యతల్లోనూ అదే నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, స్థానిక ప్రజలు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెట్లను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి

◆ లింగంపేట గ్రామ సర్పంచ్ గొడుగు జయమ్మ నర్సింలు
◆ పటేల్ చెరువు కట్టపై ఈత మొక్కలు నాటిన సర్పంచ్



**తొగుట, జులై 25 (ప్రజాజ్యోతి):** చెట్లను పెంచడం వల్లనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం జరుగుతుందని లింగంపేట గ్రామ సర్పంచ్ గొడుగు జయమ్మ నర్సింలు సూచించారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం గ్రామంలోని పటేల్ చెరువు కట్టపై గ్రామ సర్పంచ్ గొడుగు జయమ్మ నర్సింలు ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః నానుడి ప్రకారం వృక్షాలను మనం రక్షిస్తే పెంచిన వృక్షాలు మనల్ని రక్షిషిస్తాయని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకొని విరివిగా మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థుల సహకారంతో మొక్కలు నాటి పచ్చదనం కోసం కృషి చేయడానికి యువత ముందడుగు వేసి భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని వాతావరణాన్ని అందించాలని కోరారు. మన గ్రామం మన బాధ్యత అని, పచ్చని పర్యావరణం కోసం ప్రతి ఇంట ఒక మొక్క ప్రతి మనసులో ప్రకృతి పట్ల ప్రేమ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలక వర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వెంకట్రావుపేటలో నేత్రపర్వంగా తొలి ఏకాదశి వేడుకలు



**తొగుట, జులై 25 (ప్రజాజ్యోతి):** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తొగుట మండలం వెంకట్రావుపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు రమణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, శ్రీ రుక్మిణీ--సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారికి పుష్పార్చన, తులసీ అర్చన, ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు శ్రీ వేణుగోపాలస్వామిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందారు కవితా స్వామిగౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ రాయారపు అరుణ రఘుపతిరావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని వెంకటేశ్వర ఆలయంలో సైతం భక్తులు పెద్ద ఎత్తున ఏకాదశి ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# యంగ్ ఇండియా స్కూల్ తరలింపును సహించం



**కొండపాక జులై 25 (ప్రజా జ్యోతి):-** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన యంగ్ ఇండియా స్కూలను ఇతర ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను నిరసిస్తూ దుద్దెడలో బీఆర్ఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. అనంతరం వెలికట్ట చౌరస్తాలో రాజీవ్ రహదారిపై మానవహారం నిర్వహించి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యంగ్ ఇండియా స్కూల్ వేలాది మంది పేద విద్యార్థుల ఆశయమని, కాంగ్రెస్ నాయకుల కక్షసాధింపు రాజకీయాల వల్ల స్కూలను తరలించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమని విమర్శించారు. అఖిలపక్ష సమావేశాల పేరుతో కాలయాపన చేయకుండా, ప్రకటించిన స్థలంలోనే స్కూల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. స్కూలను తరలిస్తే ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని, ప్రకటించిన ప్రదేశంలోనే నిర్మించే వరకు ప్రజలతో కలిసి ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు బి ఆర్ఎస్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# రైతులు ఆయిల్ ఫామ్, పట్టు పురుగుల పెంపకం చేపట్టాలి

◆ మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి



**తొగుట, జులై 25 (ప్రజాజ్యోతి):** ఎలినినో ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని రైతులు ఆయిల్ ఫామ్ సాగు, పట్టు గొంగళి పురుగుల పెంపకం చేపట్టాలని తొగుట మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.వి నరసింహారెడ్డి సూచించారు. శనివారం చందాపూర్, జప్తిలింగారెడ్డిపల్లి, రాంపూర్, తొగుట గ్రామాలలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు



తగ్గుముఖం పట్టాయని, బోరు బావులలో నీటి మట్టాలు తగ్గుతున్నాయని, చెరువులు పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి కనిపించడం లేదు కాబట్టి రైతు మొత్తం విస్తీర్ణంలో వరి సాగు చేయకుండా, కొంత భాగంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు తక్కువ నీటితో పండే కంది, పెసర, మినుములు, జొన్న, పొద్దు తిరుగుడు మొదలైన ఆరుతడి పంటలు వేయాలని కోరడం జరిగిందన్నారు. అదే విధంగా రైతులు ఆయిల్ పామ్, కూరగాయలు పంటల పండించుటకు మొగ్గు చూపాలని, రైతులు తక్కువ నీటితో సాగు చేసే ఆయిల్ పామ్ మరియు పట్టు పురుగుల పెంపకం చేపట్టాలని సూచించడం. అనంతరం జల సిరి కార్యక్రమం లో భాగంగా రైతులు సోక్ పిట్, ఫార్మ్ పాండ్, ఊరకుంట నిర్మించు కోవాలని, దాని ద్వారా వృథా నీటిని కాపాడు కోవచ్చని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి మోహన్, ఏపిఓ నర్సింహా రెడ్డి, ఎంపీఓ విష్ణు, వెటర్నరీ డాక్టర్ వెన్నెల , ఏపిఎం బాబు రావు, ఐకెపి సూపర్ వైజర్, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, గ్రామ కార్యదర్శులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిధులు మంజూరు చేసిన ఎంపీకి కృతజ్ఞతలు

◆ చందాపూర్ గ్రామ సర్పంచ్ చందా లావణ్య స్వామి

**తొగుట, జులై 25 (ప్రజాజ్యోతి):** తొగుట మండలం చందాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైనేజీ మంజూరైనా ఎనిమిది లక్షల రూపాయల నిధుల పట్ల మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కు గ్రామ సర్పంచ్ చందా లావణ్య స్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు గారు ఆదేశాల మేరకు గ్రామంలో కొబ్బరికాయ కొట్టి డ్రైనేజీ పనులను గ్రామ సర్పంచ్ చందా లావణ్య స్వామి, ఉప సర్పంచ్ ఆత్మకూరి శ్రీకాంత్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చందాపూర్ గ్రామానికి అడగగానే నిధులు విడుదల చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ మహేశ్వరి, వార్డు సభ్యులు, బిజెపి సీనియర్ నాయకులు ఆత్మకూరి శ్రీనివాస్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడు బెజగం ఆంజనేయులు, ఎనుముల శ్రీనివాస్ యాదవ్, బూత్ అధ్యక్షుడు బొడ్డు పోచయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎనుముల స్వామి, నర్సిరెడ్డి మహేందర్, బొడ్డు స్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**కొండపాక జులై 25 (ప్రజా జ్యోతి):** -కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామానికి చెందిన భోగి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ ఆకుల భద్రప్ప మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అందరూ తోడుగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు ఇరుసాల కరుణాకర్, వార్డు సభ్యుడు ముద్దాపురం రామస్వామి, మాజీ వార్డు సభ్యుడు స్వామి, బీఆర్ఎస్ యువ నాయకులు భోగి కరుణాకర్, భోగి ఎల్లయ్య, భోగి శ్రీనివాస్, భోగి మహేష్, కిష్టాపురం ఎల్లం, భోగి సాయి, కొండపాక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### వర్షాభావం

# ఎల్నినోపై రైతులకు అవగాహన



**కొండపాక జులై 25 (ప్రజాజ్యోతి):** -కుకునూరుపల్లి మండలంలోని ఎల్లయగూడ గ్రామంలో ఎంఈఓ బి. సత్తయ్య అధ్యక్షతన ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి. సత్తయ్య మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారి గోవిందరాజు మాట్లాడుతూ రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి చిరుధాన్యాలు, పప్పుదినుసులు, కూరగాయలు, ఆయిల్పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ అధికారులు, ఏఈవో కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### గర్భధారణలో

# మధుమేహంపై శాస్త్రీయ సదస్సు



**సిద్దిపేటఅర్బన్, జులై 25 (ప్రజాజ్యోతి):-** గర్భధారణలో మధుమేహం అనే అంశంపై శనివారం సురభి వైద్య కళాశాలలో శాస్త్రీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 150 మంది వైద్యులు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, వైద్య విద్యార్థులు హాజరై శాస్త్రీయ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సదస్సులో ఫెర్నాండెజ్ హాస్పిటల్ సీనియర్ ఫిజీషియన్ డా. ఉషా, డీడీ హాస్పిటల్ ఓబీజీ కన్సల్టెంట్ డా.మంజులా రావు ముఖ్య వక్తలుగా పాల్గొని గర్భధారణలో మధుమేహం గుర్తింపు, చికిత్స, ఆహార నియమాలు, తల్లీ--శిశు ఆరోగ్య సంరక్షణ, ప్రసవానంతర సమస్యల నివారణ వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డా. రఫీ, ప్రిన్సిపాల్ డా. శైలజ, ప్రసూతి ఓ స్త్రీరోగ విభాగాధిపతి డా. మమత, ప్రొఫెసర్ డా. మంజు కుమారి, ప్రొఫెసర్ డా. సరళ, ప్రొఫెసర్ డా. చంద్రకళ, పి ఆర్ ఓ పరశరాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల విశ్వాసాన్ని కోల్పోయిన బీజేపీ

◆ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం
◆ సిద్దిపేట అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిమి భిక్షపతి



**సిద్దిపేట అర్బన్, జులై 25 (ప్రజాజ్యోతి):-** కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా పలు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సిద్దిపేట అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిమి భిక్షపతి ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలు, ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలు, కాంగ్రెస్ పార్టీ చేసిన ఒత్తిడి ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లకు స్పందించాల్సి వచ్చిందన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట విజయానికి నిదర్శనమన్నారు. ఈ నిర్ణయం ముందుగానే తీసుకుని ఉంటే విద్యార్థులు ఎదుర్కొన్న ఆందోళనలు, ఇబ్బందులు నివారించ బడేవని అభిప్రాయపడ్డారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను దేశవ్యాప్తంగా నిరంతరం ప్రస్తావిస్తూ వారికి అండగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటుందని తెలిపారు.

### విద్యార్థుల కృషి, నిరంతర

# పోరాట ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

◆ తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది రాజు



**తొగుట, జులై 25 (ప్రజాజ్యోతి):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల నిరంతర పోరాటానికి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా సాగిన ఉద్యమానికి లభించిన విజయమని తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది రాజు హర్షం వ్యక్తం చేశారు. తొగుట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ సహా వివిధ పోటీ పరీక్షల్లో చోటుచేసుకున్న పేపర్ లీకేజీలు, అవకతవకలు, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను రాహుల్ గాంధీ దేశ ప్రజల ముందుంచి విద్యార్థుల తరఫున నిరంతరం పోరాడారని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించిందని, ఆ పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లోనై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ ప్రభుత్వ విధానాలపై దేశ ప్రజలు తగిన సమయంలో తీర్పు ఇస్తారని, యువత విశ్వాసాన్ని కోల్పోయిన కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భరత్ తేజ, బందారు రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బెజుగామ శ్రీకాంత్, ఐక్యోళ్ల నరసింహారెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు చిక్కుడు బాలమల్లు, సోమగారి బ్రహ్మానందరెడ్డి, నాయకులు బెజ్జనమైన అనిల్, కొలుపుల రాములు, పంది సర్సింలు, ఉప్పరి శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# యువత ఏకలవ్యున్ని ఆదర్శంగా తీసుకోవాలి

◆ ఎరుకల హక్కుల సాధనకు ఐక్యంగా కృషి చేయాలి
◆ సిద్దిపేటలో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



**సిద్దిపేట అర్బన్, జులై 25(ప్రజాజ్యోతి):-** నేటి యువత ఏకలవ్యుని క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్య సాధనను స్ఫూర్తిగా తీసుకోవాలని రిటైర్డ్ డిపీఓ, ఏకలవ్య సంఘం గౌరవ సలహాదారులు కెమ్మసారం పోచయ్య అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిద్దిపేట ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సంఘం సభ్యులతో కలిసి ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుభక్తి, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి ఏకలవ్య ప్రతీక అని అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని, సమాజ అభ్యున్నతికి యువత సేవాభావంతో ముందుండాలని, ఎరుకల సామాజిక వర్గం సంక్షేమానికి, హక్కుల సాధనకు రాజకీయాలకతీతంగా ఐక్యంగా కృషి చేయాలని తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శాశ్వత ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేసుకోబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కెమ్మసారం మురళి, లక్ష్మణ్, ఎల్లయ్య, నర్సింలు, సంతోష్ , రాజేష్ ఖన్నా, శ్రీనివాస్, శ్రవణ్, భగవాన్, నాగరాజు, ప్రశాంత్, ముత్యాలు, యాదగిరి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాంగణ నియామకాల్లో సత్తా చాటిన విద్యార్థులు

◆ సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాల సెక్రెటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి
◆ ప్లేస్ మెంట్ డ్రైవ్లో ఉద్యోగాలు పొందిన102 మంది విద్యార్థులు ◆ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి







**గజ్వేల్, జులై 25 (ప్రజా జ్యోతి):** ప్రాంగణ నియామకాల్లో 102 మంది సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు పొంది సత్తా చాటారని కళాశాల సెక్రెటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగణంలో మాజిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాంగణ నియామకాల ప్రక్రియలో అరబిందో ఫార్మా, క్వెస్ క్రాప్, మెడ్ ప్లస్, వి ఎల్ ఆర్ ఫెలిసిటేటర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరై విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి డ్రైవ్ కు హాజరైన విద్యార్థుల నుండి 102 మంది విద్యార్థులకు ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాచర్ల వెంకటరమణ, కంపెనీ హెచ్ఆర్ ల చే నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ కళాశాలలో చేపట్టిన ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటడం ఎంతో సంతోషంగా ఉందని, కళాశాలలోని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, లాబ్ సౌకర్యాలను పూర్తి స్థాయిలో కల్పించడం జరిగిందని, వాటిని విద్యార్థులు సరైన విధంగా ఉపయోగించుకొని నేడు ఉద్యోగాలు పొందడం విద్యార్థుల క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉంటారని చెప్పడానికి ఇదొక మంచి ఉదాహరణ అన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చడానికి విద్యార్థులు చేసిన కృషికి నేడు ఫలితం దక్కిందన్నారు. నేటి సమాజంలో విద్యకు మించిన ఆస్తి లేదని, విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవడానికి అవకాశం ఉందని, సమయాన్ని వృథా చేయకుండా ఇష్టంతో చదివి భవిష్యత్ లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు శివారెడ్డి, సాయి శైలేష్, సునీల్ రావు, ధర్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.గణేష్, డాక్టర్ స్వాతి, డాక్టర్ రోహిణి, డాక్టర్ శాంతిప్రియ, నరేష్ రెడ్డి, సౌందర్య, పూజిత, శ్రీముఖి, లుబ్న, చంద్రిక, కృష్ణ, కే.అరుణ, ప్రవీణ్, కరుణాకర్, అనిల్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 2, 3 తేదీల్లో పరిగిలో మైసమ్మ-పోచమ్మ బోనాలు

- సన్నాహక సమావేశంలో పుర ప్రముఖులు, ఆలయ కమిటీ తీర్మానం
- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



**పరిగి, జూలై 25 (ప్రజా జ్యోతి) :** పరిగి పట్టణంలో ప్రతి సంవత్సరం నిర్వహించే మైసమ్మ, పోచమ్మ బోనాల పండుగను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు బహర్‌పేట్ పోచమ్మ ఆలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొని బోనాల పండుగ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో పాల్గొన్న వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆగస్టు 2, 3 తేదీలలో మైసమ్మ, పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. పండుగ సందర్భంగా సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు, బోనాల ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. పట్టణ ప్రజలందరూ పాల్గొని పండుగను విజయవంతం చేయాలని సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్‌తో పాటు పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## కేజీబీవీ నస్కల్‌లో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**పరిగి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** పరిగి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) నస్కల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 7వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలని, పరిగి మండలానికి చెందిన స్థానిక మహిళలై ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 25 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు పరిగి మండల విద్యావనరుల కేంద్రం (ఎంఈఓ కార్యాలయం)లో అందుబాటులో ఉన్నాయని, పూర్తిగా నింపిన దరఖాస్తులను ఈ నెల 29వ తేదీలోపు సమర్పించాలని ఎంఈఓ సూచించారు. ఈ పోస్టుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఎంఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

## బ్రేజా కొత్త వెర్షన్‌కు ఘన ఆవిష్కరణ

- వనస్థలిపురం వరుణ్ మోటార్స్‌లో సందడి..
- ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్వేత చేతుల మీదుగా ఆవిష్కరణ



**అబ్దుల్లాపూర్ మెట్టు జూలై 25(ప్రజాజ్యోతి) :** దేశీయ ఆటోమొబైల్ రంగంలో అగ్రగామిగా ఉన్న మారుతి సుజుకి సంస్థ తన అత్యంత ప్రజాదరణ పొందిన ఎస్‌యూవీ బ్రేజా నూతన వెర్షన్‌ను శనివారం వనస్థలిపురం ఆటోనగర్‌లోని వరుణ్ మోటార్స్ షోరూంలో ఘనంగా ఆవిష్కరించింది. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్వేత ముఖ్య అతిథిగా పాల్గొని నూతన బ్రేజాను ఆవిష్కరించారు. అత్యాధునిక సాంకేతికత, ఆకర్షణీయమైన డిజైన్, మెరుగైన భద్రతా ప్రమాణాలతో రూపొందించిన ఈ నూతన బ్రేజా కె 15 సి టర్బో పెట్రోల్ బూస్టర్ జెట్, సీఎన్‌జీ, ఎస్-సీఎన్‌జీ వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. పెట్రోల్ వేరియంట్ లీటర్‌కు 20.47 నుంచి 21.09 కిలోమీటర్ల వరకు, ఎస్-సీఎన్‌జీ వేరియంట్ కిలో సీఎన్‌జీకి 26.9 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సీఎన్‌జీ ట్యాంకును కారు అడుగుభాగంలో అమర్చడంతో విశాలమైన బూట్ స్పేస్‌ను అందుబాటులో ఉంచారు. ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, ఎల్-షేప్ డీఆర్‌ఎల్స్, 10.1 అంగుళాల స్మార్ట్‌ప్లే ప్రో ఎక్స్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్లెస్ చార్జింగ్ వంటి ఆధునిక ఫీచర్లు వినియోగదారులను ఆకట్టుకోనున్నాయి. భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ భారత్ ఎన్‌సీఏపీ 5 స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా ఈ వాహనాన్ని రూపొందించినట్లు కంపెనీ వెల్లడించింది. ప్రారంభ ధర రూ. 7.4 లక్షలు కాగా, రూ. 11వేల టోకెన్‌తో షోరూంలలో లేదా ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ కొత్త బ్రేజా మార్కెట్లో విశేష ఆదరణ పొందుతుందని వరుణ్ మోటార్స్ ప్రతినిధులు విశ్వాసం వ్యక్తం చేశారు.

**బ్రేజా ప్రత్యేకతలు :** ఖ15జ టర్బో పెట్రోల్ బూస్టర్ జెట్ ఇంజిన్, సీఎన్‌జీ, ఎస్-సీఎన్‌జీ వేరియంట్లు, పెట్రోల్ మైలేజ్ 20.47--21.09 కి.మీ./లీటర్, ఎస్-సీఎన్‌జీ మైలేజ్ 26.9 కి.మీ./కేజీ, 10.1 అంగుళాల స్మార్ట్‌ప్లే ప్రో ఎక్స్ టచ్‌స్క్రీన్, వైర్లెస్ చార్జింగ్, ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, భారత్ ఎన్‌సీఏపీ 5 స్టార్ భద్రతా ప్రమాణాలు, ప్రారంభ ధర రూ. 7.4 లక్షలు, ఈ కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సి. రాజు, సీజీఎం కౌశిక్, జీఎం కృష్ణ, డీజీఎం రాము, బ్రాంచ్ మేనేజర్ అశోక్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు. హయత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, దీపావళి శ్రవణ్ కుమార్, గుత్తా లక్ష్మారెడ్డి, దీపావళి శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.

## విద్యార్థుల ఉద్యమానికి చారిత్రాత్మక విజయం

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- పరీక్షలో అన్యాయాలకు గురైన విద్యార్థులకు న్యాయం జరగాలి
- తలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ కుమార్



**తలకొండపల్లి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత సాగించిన ఉద్యమానికి దక్కిన చారిత్రక విజయమని తలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నీట్-యూజి 2026 పేపర్ లీక్ మరియు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై న్యాయమైన డిమాండ్ల కోసం లాఠీచార్జీలు, నిర్బంధాలను సైతం ఎదుర్కొంటూ పోరాడిన విద్యార్థుల ధైర్యసాహసాల సత్ఫలితమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామాకు కారణమైందని విద్యార్థుల ఐక్యమత్యాన్ని వారు అభినందించారు. ఈ ఉద్యమం యువత ఐక్యంగా పోరాడితే మార్పు సాధ్యమేనని మరోసారి నిరూపించింది. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించి విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టాలని వారు కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించాలని ఆయన అన్నారు. ఈ ఉద్యమానికి పార్లమెంట్లో గాని, విద్యార్థుల నిరసన జ్వాలలో అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి యువత తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఉపాధ్యాయులు పాఠశాల స్థాయిలో రెమిడీయేషన్ కార్యక్రమాన్ని అమలు చేయాలి





పరిగి మండల విద్యాధికారి

**పరిగి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** మౌలిక భాషా గణిత సామర్థ్యాల నైపుణ్యాలను సాధించడంలో వెనుకబడి ఉన్న విద్యార్థులను ఆదుకోవడానికి ప్రతిరోజు ప్రత్యేకంగా కేటాయించిన సమయమే రెమిడీయేషన్ అని పరిగి మండల విద్యాధికారి అంజయ్య తెలిపారు. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ వారు ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్స్ కొరకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జడ్పిహెచ్ఎస్ నెంబర్ వన్ పాఠశాలలో మొదటి స్పెల్ సోమవారం నుండి బుధవారం వరకు రెండో స్పెల్ గురువారం వారం నుండి శనివారం వరకు నిర్వహించడం జరిగింది. యాభై శాతం ఉపాధ్యాయులు మొదటి స్పెల్ యందు మిగిలిన యాభై శాతం ఉపాధ్యాయులు రెండో స్పెల్ శిక్షణ కార్యక్రమానికి హాజరుతో శనివారం సాయంత్రం ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శిక్షణ కార్యక్రమం కోర్సు డైరెక్టర్ పరిగి మండల విద్యాధికారి అంజయ్య శిక్షణ కార్యక్రమం యొక్క ఉద్దేశాలను ఆశయాలను తెలియజేశారు. విద్యా ప్రగతిలో విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదిగే విధంగా చేసే బాధ్యత ఉపాధ్యాయులపై వుందని అన్నారు. ఎనభై శాతం పైగా సామర్థ్యాలు సాధించే విద్యార్థులకు ఒక పీజీ పర్ఫార్మెన్స్ గ్రూపు గాను ఎనభై శాతం కంటే తక్కువ సామర్థ్యాలు గల విద్యార్థులను టీచర్ సపోర్టు గ్రూపుగా విభజించి ప్రతి రోజు మూడు నుండి నాలుగు గంటల మధ్య ప్రత్యేకంగా విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ గా ఎండి ఉస్మాన్ అలీ, ఎం.రాజేష్, వెంకట ప్రసాద్, నరేందర్ సహా వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, సీఆర్పీలు చంద్రశేఖర్, శ్రీనివాస్ ఎమ్మార్పీ సిబ్బంది, మోహన్ బాబు, శ్రీశైలం పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమాల విజయమే : సిపిఎం, ఎస్ఎఫ్ఐ

- పరిగి బస్ స్టాండ్ దగ్గర టపాసులు పేల్చి సంబరాలు - నీట్ లీకేజీపై సమగ్ర విచారణకు డిమాండ్






**పరిగి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, విద్యా వ్యవస్థలో అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. మంత్రి రాజీనామా సందర్భంగా శనివారం పరిగి బస్ స్టాండ్ వద్ద సిపిఎం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య, బుస్స చంద్రయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ, పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోల్పోవడమే ఈ పరిస్థితికి కారణమని విమర్శించారు. విద్యార్థులు, యువజన సంఘాలు, ప్రజాస్వామిక శక్తులు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనల ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని, ఇది విద్యార్థి ఉద్యమాల విజయానికి నిదర్శనమని అన్నారు. అలాగే సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌పై చేపట్టిన నిర్బంధ చర్యలను ఖండిస్తూ, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న వారిపై అణచివేత విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీ వ్యవహారంపై పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిపి, కుట్రలో పాల్గొన్న వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల స్వరం గెలిచింది... ప్రజాస్వామ్యం నిలిచింది!

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయమే - కాంగ్రెస్ పార్టీ





**పరిగి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడం విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని, ప్రజాస్వామ్య స్ఫూర్తి నిలిచిందని శనివారం పరిగి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు. వరుసగా పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. గత 25 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందని తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలుపుతూ వారి పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ముందు నిరసన చేపట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారని అన్నారు.

విద్యార్థుల ఐక్య పోరాటం, దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు, కాంగ్రెస్ పార్టీ నిరంతర ఉద్యమం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఇది ఒక వ్యక్తి రాజీనామా మాత్రమే కాదు... విద్యార్థుల స్వరం గెలిచిందని, ప్రజాస్వామ్యం నిలిచిందనే దానికి నిదర్శనం అని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు, నిరుద్యోగుల హక్కులను కాలరాసే ప్రయత్నం జరిగితే కాంగ్రెస్ పార్టీ మరింత తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగుల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన రాగం నాగేందర్ యాదవ్





బిఎల్ ఓ అధికారులు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు

**శేరిలింగంపల్లి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా-స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా గత నెల జూన్ 24వ తేదీ నుండి నియమించిన బీఎల్ఓ అధికారులు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తు న్నారని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా స్థానికంగా బీఎల్ఏ లను ఏర్పాటు చేసి, వారిని బిఎల్ఓ లకు అనుసంధానించి కొంతమంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడంలో సహాయం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఓటు అత్యంత ప్రాధాన్యత అనే దృక్పథంతో అధికారులు, కార్యకర్తలు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ డివిజన్ పరిధిలోని తారానగర్, ఆదర్శ్ నగర్, బాపునగర్ మరియు వివిధ ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్యుమరేషన్ సర్వే పనులను పరిశీలించారు. బిఎల్ఓ, బిఎల్ఏలు చేస్తున్న పనితీరును అడిగి తెలుసుకుని, ఎటువంటి ఓటరు కూడా తప్పిపోకుండా ఫారాలు అందేలా చూడాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ అనేది ఓటరు జాబితాను కచ్చితంగా తయారు చేసే కీలక ప్రక్రియ అని, ప్రజలందరూ ఎన్యుమరేటర్లకు సహకరించి సక్రమంగా వివరాలు నమోదు చేయించుకోవాలని కార్పొరేటర్ కోరారు. సర్వేలో ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా పని చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.

అనంతరం మాట్లాడుతూ... ఎస్.ఐ.ఆర్ సర్వే అనేది చాలా కీలకమైన ప్రక్రియ అని ఈ డేటా ఆధారంగానే ఓటరు జాబితా తయారవుతుందని అన్నారు. కొన్ని బూతుల్లో ఎన్యుమరేషన్ శాతం తక్కువగా ఉండటం గమనించాం. అంటే అక్కడ ఇంకా సర్వే పూర్తికాని ఇళ్ళు ఉండే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి బూత్ ఇంచార్జ్ అప్రమత్తంగా ఉండి 100 శాతం సర్వే పూర్తి చేయాలి అని అన్నారు. సర్వేలో ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా వివరాలు నమోదు చేయాలని ఒకవేళ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఓటర్లను విస్మరింప చేసే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, వార్డు మెంబర్ కవిత, దేవులపల్లి శ్రీకాంత్, గోపినగర్ అంబేద్కర్ భవన్ జనచైతన్య అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, సుధాకర్ రెడ్డి, రవీందర్, మహేష్ చారీ, నటరాజ్, సయ్యద్ మీర్ అలీ, అహ్మద్, మహేందర్ సింగ్, సత్యనారాయణ, తుకారామ్, తదితర బూత్ బిఎల్ఓ లు, బిఎల్ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## మోమిన్ పేట్ మండల ఉపసర్పంచుల సంఘం నూతన (కమిటీ) ఏర్పాటు



**మోమిన్ పెట్ జూలై 25 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా ఉపసర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్ గోపాల్ గారి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గౌరవ శ్రీ లావుడియా రాములు నాయక్ గారి ఆదేశాల మేరకు మండల ఉపసర్పంచుల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్ గోపాల్ గారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఉపసర్పంచుల సంఘం మండల అధ్యక్షులుగా :** ఆర్.మహేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు:- కే.రామచెంద్రీ, ప్రధాన కార్యదర్శి :- సయ్యద్ అస్లాం, ఉపాధ్యక్షులు :- కొర్ర రాము నాయక్, ప్రకాష్, మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్:- సరోజ వెంకటేష్, బాలకృష్ణ, కోశాధికారి:- రమేష్, ఉమ్మడి కార్యదర్శులు హెచ్ వెంకటేష్, వీ ఈశ్వరి ముఖ్య సలహాదారు:- వడ్త్యా సీతారామ్ నాయక్, సౌకత్ అలీగారు మరియు కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ల బాడీ సభ్యులు పాల్గొనడం జరిగింది.. వీరందరినీ నియమిస్తూ వారికి కూడా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణ, ఆత్మగౌరవం, ఐక్యత మరియు గ్రామాభివృద్ధి కోసం మండలంలోని ఉపసర్పంచు లందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్‌గా గుండె గణేష్ ముదిరాజ్ నియామకం



**శేరిలింగంపల్లి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** మియాపూర్ రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్‌గా శేరిలింగంపల్లి నియోజకవర్గం, మియాపూర్ డివిజన్ కు చెందిన సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ ను అధిస్థానవర్గం నియమిశీచారు. సందర్భంగా గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ పార్టీ పట్ల అంకితభావం, ప్రజాసేవాలో ఉంటూ పార్టీ ఇచ్చిన ఆదేశాలను తూచ తప్పకుండా పాటించడం వల్ల తన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టాన వర్గం తనను జిల్లా కమిటీలో తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి రావడానికి కారకులైన శేరిలింగంపల్లి ఇంచార్జి రవికుమార్ యాదవ్‌కి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డికి, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుకి, స్థానిక నాయకులకు, అనుబంధ సంఘాల వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ అభివృద్ధి కి మరింత శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అందరిని కలుపుకొని, ప్రజలను చైతన్య పరుస్తామని పేర్కొన్నారు.

## పేదల ఆకలి తీర్చేందుకే అన్నదానం చేస్తున్నాం


హోప్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్....





**శేరిలింగంపల్లి, జూలై 25 (ప్రజాజ్యోతి) :** చందానగర్ ఆకలితో అలమటిస్తున్న బడుగు బలహీన వర్గాలకు పాదచారులకు, చందా నగర్ గంగారంలోని వివిధ షోరూం పని చేస్తున్న ప్రజలకు ప్రతి శనివారం సుమారు 3000 మందికి అన్నదానం నిర్వహించడం హర్షణీయమని స్థానిక ప్రజలు అన్నారు. హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ నియమ నిబంధనలు పాటిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నె అపర్ణ, అన్నె సందీప్, విష్ణు మూర్తి, రవి, పీటర్, మారం ప్రసాద్, శంకర్, షర్ఫుద్దీన్, విజయ్, ప్రకాష్, దత్తు, సురేష్, హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంగళపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం



**ఇబ్రహీంపట్నం జూలై 25 ప్రజాజ్యోతి :** ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని, మంగళపల్లి సబ్ స్టేషన్ లో కొత్త బ్రేకర్స్ అమర్చనున్న కారణంగా, నేడు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఒకటి గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు, ఆదిభట్ల ఏఈ జయన్న ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోకి వచ్చే బొంగులూరు, మంగళపల్లి 1, మంగళపల్లి 2, ఎంపీ పటేల్ గూడ, సివిఆర్ కాలేజ్, చింతపల్లి గూడ, కొంగరకలను, రోహిణి డెడికేటెడ్ ప్రాంతాలలోని ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్న కారణంగా, టిజిఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు ఇట్టి విషయాన్ని గమనించి విద్యుత్ సంస్థకు సహకరించగలరని ఆదిభట్ల ఏఈ తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావం.. సాగులో మార్పులు అవసరం

కొడిమ్యాల, జూలై 25 (ప్రజాజ్యోతి):
ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికతో పాటు సస్యరక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డా. ఎ. విజయ్ భాస్కర్ సూచించారు. శనివారం మండలంలోని డబ్బుతిమ్మయపల్లి, నాచుపల్లి గ్రామాల్లో వరి నర్సరీ, పత్తి, పసుపు,



మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి నాట్లలో కాలిబాటలు ఏర్పాటు చేయడం, ముదిరిన నారు పైభాగాన్ని కత్తిరించి నాటడం వల్ల పంట ఆరోగ్యంగా పెరగడంతో పాటు చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు ఏసిఫేట్ లేదా క్లోరోపైరిఫాస్‌ను వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును పిచికారీ చేయడంతో పాటు ఎకరానికి ఎనిమిది ఫెరోమోన్ ట్రాప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగు చేపట్టడం ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఏఈఓ శ్రీలత, మాజీ ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి, రైతులు నర్సయ్య, అమర్‌నాథ్ రెడ్డి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్గటూర్‌లో 'నేను సైతం' సీసీ కెమెరాల ఏర్పాటు

### నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం అవసరం

వెల్గటూర్ ,జులై 25 ప్రజా జ్యోతి:




నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పోలీసు శాఖ చేపడుతున్న 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా వెల్గటూర్ గ్రామంలో వెంకటసాయి ట్రేడర్స్ సహకారంతో దుకాణం ఎదుట రహదారి స్పష్టంగా కనిపించేలా రెండు సీసీ కెమెరాలను అమర్చారు.జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ కె. పురుషోత్తంరెడ్డి సూచనలతో, ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వెల్గటూర్ ఎస్ఐ పి. ఉదయ్ కుమార్ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ.సమాజంలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని , ప్రతి వ్యాపార సంస్థ, వాణిజ్య సముదాయం, దుకాణ యజమానులు తమ దుకాణాల ఎదుట రహదారులు స్పష్టంగా కనిపించేలా నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని,సీసీ కెమెరాల వల్ల అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన వారిని త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని తెలిపారు.పోలీసు శాఖ చేపడుతున్న 'నేను సైతం' కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి తమ ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేర రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సీఐ పిలుపునిచ్చారు.

## ఇంటింటా ఇంకుడు గుంతలే నీటి భద్రతకు భరోసా

కొడిమ్యాల, జూలై 25 (ప్రజాజ్యోతి):
మండలంలోని నల్లగొండ గ్రామంలో ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తూ ఇంకుడు గుంతల నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు.





కార్యక్రమాన్ని అదనపు డీఆర్‌డీఓ, డీపీఓ మదన్ మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పరిరక్షణకు ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. అలాగే కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు, ఫార్మ్ పాండ్లు, పండ్ల తోటల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాళవిక శ్రీకాంత్ యాదవ్,ఏపీఓ సతీష్, పంచాయతీ కార్యదర్శి మధు, ఫీల్డ్ అసిస్టెంట్ నీలా, వీవో ఏ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు ఐదు వెలా రూపాయలు అందించిన సర్పంచ్

ఇల్లంతకుంట జూలై 25(ప్రజజ్యోతి):
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఓగులపూర్ గ్రామానికి చెందిన



పేదరాలు గాలిపెల్లి పోచమ్మ ఆదివారం రోజు మరణించగా వారి కుటుంబానికి దహనసంస్కారాలకు సర్పంచ్ వికృతి స్నేహ లక్ష్మారెడ్డి 5000 రూపాయలు అందజేసారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరె కొమురయ్య మాజీ ఉపసర్పంచ్ గుండేటి ప్రశాంత్ వార్డ్ సభ్యుడు సురేష్ బి ఆర్ ఎస్ ప్రెసిడెంట్ అలవాల రాజేశం పండుగ రాజిరెడ్డి ఏనుగుల రాజు శేఖర్ ముత్తయ్య సంపతీ కొమురయ్య ఎడ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా ఫెర్టీ9కు అంతర్జాతీయ గుర్తింపు

### ఫెర్టీ9 కరీంనగర్ కేంద్రం వైద్య నిపుణుడు డాక్టర్ బిజిబి పిళ్లై

కరీంనగర్ టౌన్ జులై 25( ప్రజా జ్యోతి ):
నీడిల్–రహిత ఐవీఎఫ్ సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనలతో దంపతులకు ఆధునిక ఫెర్టిలిటీ చికిత్సలు ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్టీ9 కరీంనగర్ కేంద్రం వైద్య నిపుణుడు డాక్టర్ బి.జి.బి. పిళ్లై మాట్లాడుతూ, ఫెర్టీ9 క్లినికల్ బృందం ప్రపంచ ప్రఖ్యాత సదస్సుల్లో పరిశోధనా పత్రాలను సమర్పించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందిందని తెలిపారు. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో అది 1.8, ఆంధ్రప్రదేశ్‌లో 1.7గా నమోదైందన్నారు. జీవనశైలి మార్పులు, మానసిక



ఒత్తిడి, ఆలస్య వివాహాలు, ఉద్యోగ పరిస్థితులు, పురుషులు, మహిళల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. అయితే ప్రారంభ దశలోనే నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు, ఆధునిక చికిత్సలు తీసుకుంటే విజయావకాశాలు గణనీయంగా పెరుగుతాయని



సూచించారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా ఫెర్టీ9 తన 11 కేంద్రాల్లో నీడిల్–రహిత ఐవీఎఫ్ సేవలను ప్రారంభించిందని తెలిపారు. దీని వల్ల రోజువారీ ఇంజెక్షన్లతో కలిగే నొప్పి, ఆందోళన తగ్గుతాయని వివరించారు. అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రజనన ఆరోగ్య పరిశోధనల ద్వారా ఐవీఎఫ్ విజయశాతాన్ని పెంచడంతో పాటు ఇంప్లాంటేషన్ వైఫల్యాలను తగ్గించే దిశగా సంస్థ కృషి చేస్తోందన్నారు.భవిష్యత్తులో ఇంప్లాంటేషన్ వైఫల్యాలు, గర్భస్రావాల నివారణకు ప్రత్యేక అత్యుత్తమ కేంద్రాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల దంపతులకు మరింత ఆధునిక ఫెర్టిలిటీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోని 11 ఫెర్టిలిటీ కేంద్రాల ద్వారా ఫెర్టీ9 సేవలు అందిస్తోందని, కరీంనగర్ కేంద్రం అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్యుల సేవలతో వేలాది మంది దంపతులకు తల్లిదండ్రులయ్యే ఆనందాన్ని అందిస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్ లో ప్రారంభమైన ఎంఆర్‌ఎఫ్ 'బాలాజీ టైర్ వరల్డ్' షోరూం

### అత్యాధునిక పరికరాలతో వీల్ అలైన్‌మెంట్, బాలెన్సింగ్, టైర్ సేవల సర్వీస్ కేంద్రం

కరీంనగర్ టౌన్ జూలై 25 (ప్రజా జ్యోతి ):
నగరం లోని మంచిర్యాల చౌరస్తా సమీపం లో ఎంఆర్‌ఎఫ్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలాజీ టైర్ వరల్డ్ టైర్స్ & సర్వీస్






ఫ్రాంచైజీని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఎఫ్ దక్షిణ భారత విభాగీయ మేనేజర్ ఈశ్వర్ పి. ఇట్నాల్, షోరూం యజమాని కుమారస్వామి, జిల్లా మేనేజర్ జగదీశ్వర్ రావు, కరీంనగర్ ఇన్‌చార్జి మహేందర్ పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈశ్వర్ పి. ఇత్మల్ మాట్లాడుతూ, జగిత్యాలలో 2018లో మొదట కుమారస్వామి ప్రారంభించిన, బాలాజీ టైర్ వరల్డ్ విజయవంతంగా కొనసాగుతోందని, అదే విధంగా కరీంనగర్ కేంద్రం కూడా ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా ఎంఆర్‌ఎఫ్‌కు సుమారు 1,400 షోరూములు ఉన్నవి, ప్రతి ఆరు వేల కిలోమీటర్లకు ఒకసారి వీల్ అలైన్‌మెంట్ చేయించుకోవడం వల్ల టైర్ల జీవితకాలం సుమారు 25 శాతం పెరుగుతుందని సూచించారు.ఈ కేంద్రంలో దిగుమతి చేసిన అత్యాధునిక యంత్రాలతో వీల్ అలైన్‌మెంట్, వీల్ బాలెన్సింగ్, స్వయంచాలక టైర్ అమరిక, ట్యూబ్‌లెస్ టైర్ మరమ్మతులు, నైట్రోజన్ గాలి నింపే సేవలు అందుబాటులో ఉన్నాయి. వాహనాల సేవల సమయంలో వినియోగదారులు వాతానుకూలిత విశ్రాంతి మందిరంలో సౌకర్యవంతంగా వేచి ఉండే ఏర్పాట్లు చేశారు.చెన్నైలోని ఎంఆర్‌ఎఫ్ శిక్షణ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ పొందిన నిపుణుల సేవలు అందుబాటులో ఉండటం ఈ కేంద్రం ప్రత్యేకతగా నిలుస్తోంది. అలాగే జెడ్‌ఎల్‌ఎక్స్, పెర్ఫింజా వంటి ఎంఆర్‌ఎఫ్ నాణ్యమైన కారు రేడియల్ టైర్లతో పాటు ఆధునిక టైర్ సేవలను కరీంనగర్ వాహనదారులకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం లో షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాచర్ల వెంకటేశ్వర్లు పోటెత్తిన జనం

### తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట జూలై 25 ప్రజా జ్యోతి
ఎల్లారెడ్డిపేట మండలం లోని రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రాచర్ల లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు మొక్కులను తీర్చుకున్నారు వివిధ గ్రామాలకు భక్తులు దాదాపు 6 నుంచి 8000 వరకు వరకు



వచ్చారని అంచనా భక్తులు తమ మొక్కులను తీర్చుకొని కొండపై ఏర్పాటు చేసిన దేవాలయానికి తొలి ఏకాదశిగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం భక్త మండలి ప్రత్యేక ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

### వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

చిగురుమామిడి/జూలై 25, ప్రజా జ్యోతి:
చిగురుమామిడి మండలంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించారు. మండలంలోని ఆలయాలన్నీ తెల్లవారుజామునే భక్తులతో కిటకిటలా



డగా, గోవింద నామస్మరణలు, విష్ణు సహస్రనామ పారాయణాలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.సుందరగిరి గ్రామంలోని కోర మీసాల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చకులువేద మంత్రోచ్చారణల మధ్య అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, భక్తులు "గోవింద... గోవింద..." నామస్మరణతో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి భావంతో నిండిపోయింది. మండలంలోని ఇతర విష్ణు ఆలయాలు, గ్రామ దేవాలయాల్లో కూడా తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. ఏడాదిలో అత్యంత విశిష్టమైన ఏకాదశిగా భావించే ఈ పర్వదినం సందర్భంగా పలువురు భక్తులు నిర్జల, ఫలాహార ఉపవాస దీక్షలను ఆచరించారు. మరికొందరు సంప్రదాయ పద్ధతిలో పిండి వంటలు తయారు చేసి కుటుంబ సభ్యులతో కలిసి భుజిస్తూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా గ్రామాల్లో భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికత కలగలిసి కనిపించగా, ఆలయాల్లో శాంతి, సౌభాగ్యం, సకల జనుల ఆయురారోగ్యాల కోసం, సమృద్ధిగా వర్షాలు పడాలని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొత్తం మీద చిగురుమామిడి మండలంలో తొలి ఏకాదశి పర్వదినం భక్తి ప్రపత్తులతో ఘనంగా జరిగింది.

# అన్యాయంగా సస్పెండ్ చేసిన దళిత ఎస్ఐ ఎం. చిరంజీవిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

– తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు కోరుట్ల అంబేద్కర్ యువజన సంఘాల వినతి

కోరుట్ల జులై 25 ప్రజాజ్యోతి
కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దళిత



అధికారి ఎం. చిరంజీవి ని ఎలాంటి సమగ్ర విచారణ లేకుండానే సస్పెండ్ చేయడం అన్యాయమని కోరుట్ల నియోజకవర్గ అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను ఆశ్రయించారు.శనివారం కోరుట్ల కు వచ్చిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు చైర్మన్ ను ఘనంగా సన్మానించారు. అనంతరం కోరుట్ల ఎస్సై ఎం చిరంజీవి సస్పెన్షన్ ను ఎత్తివేయాలని వినతి పత్రం సమర్పించారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈమధ్యనే మెట్ పల్లిలో హత్యకు గురైన కర్రే సునీత కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇచ్చిందనే ప్రచారం వాస్తవానికి విరుద్ధమని పేర్కొన్నారు. సునితను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా కసుల గంగారెడ్డి అడ్డుకున్నారని తెలిపారు. అయితే, ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టకుండా, దళిత అధికారిగా పనిచేస్తున్న ఎం. చిరంజీవిపై చర్యలు తీసుకోవడం బాధాకరమని అన్నారు. అసలు బాధితురాలిని ఫిర్యాదు



చేయకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఎలాంటి తప్పు నిరూపితం కాకముందే ఎస్సై చిరంజీవిని సస్పెండ్ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. కాబట్టి ఎం. చిరంజీవిపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, అలాగే బాధితురాలి కర్రే సునిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకోవాలని కోరారు. పోలీస్ స్టేషన్లో సునిత ను ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కసుల గంగారెడ్డిపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ను కోరారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్, రాష్ట్ర నాయకులు బలిజ రాజారెడ్డి, వుయ్యాల నర్సయ్య, ఎమ్మార్పీఎస్ జర్నలిస్టు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెట్ పల్లి లక్ష్మణ్, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీ నారాయణ, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు ఉయ్యాల శోభన్,మాల మాదిగ కుల సంఘాల నాయకులు పసుల కృష్ణ ప్రసాద్, శనిగారపు రాజేష్, బలిజ రాజ శేఖర్, పసులు చిన్నయ్య, మోర్తాడ్ రాజశేఖర్, సామల్ల వేణు, సత్యం, నారాయణ తదితర దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మెయిన్ రోడ్డు విస్తరణకు సహకరించాలి

### వ్యాపారులు, ఇంటి యజమానులకు మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య విజ్ఞప్తి

### మెయిన్ రోడ్ లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

పెద్దపల్లి, ప్రతినిధి జూలై 25 (ప్రజాజ్యోతి):
పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా జండా చౌరస్తా నుంచి మజీద్ వరకు ఉన్న ప్రధాన రహదారి విస్తరణ పనులకు వ్యాపారులు, వాణిజ్య సంస్థల యజమానులు, ఇంటి యజమానులు స్వచ్ఛందంగా సహకరించాలని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య కోరారు. రోడ్డు విస్తరణలో భాగంగా శనివారం ఉదయం జండా చౌరస్తా వద్ద ఉన్న మున్సిపల్ సముదాయ భవనం, పోస్టాఫీస్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రహరీ గోడలను తొలగించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, జండా చౌరస్తా నుంచి మజీద్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై ప్రతిరోజూ అధిక రద్దీ నెలకొంటున్నందున ప్రజల సౌకర్యార్థం రహదారి విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు ఈ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో గ్రామపంచాయతీ పరిధిలో ఈ రహదారి వెడల్పు 80 అడుగులుగా ఉండేదని, అనంతరం మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా 60 అడుగులకు తీర్మానం చేసిందని తెలిపారు. అనంతరం వ్యాపారులు, ఇంటి




యజమానుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే జోక్యంతో రహదారి వెడల్పును 55 అడుగులకు నిర్ణయించినట్లు వివరించారు. దుకాణ యజమానులు స్వచ్ఛందంగా రెండు నుంచి మూడు రోజుల్లో తమ ఆక్రమణలను తొలగించుకుంటామని హామీ ఇచ్చారని, పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు మంథని నర్సింగ్, కొట్టె స్వరూప సదానందం, మోలుగురి కమల్, దొడ్డుపల్లి జగదీష్, అస్లాం పర్వేజ్, హీనా యబ, గంగుల సంధ్యారాణి సతీష్, తూముల లత సుభాష్, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పులిపాక రాజు, రామ్మోహన్ రెడ్డి, జవాన్ అనిల్, మున్సిపల్ సిబ్బంది గోడిసెల శ్రీనివాస్, శంకర్, భూమేష్, శ్రీకాంత్, రసూల్, సద్దాం పాల్గొన్నారు.

## జమలాపురం గ్రామంలో సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన నిర్మలా కుమారి



**ఎర్రుపాలెం ప్రజాజ్యోతి** మండల పరిధిలోని జమలాపురం హైస్కూల్ నందుశనివారం గ్రామ సర్పంచ్ తుళ్ళూరి నిర్మలా కుమారి సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు బ్రేక్ఫాస్ట్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తల్లపురెడ్డి వెంకటరామిరెడ్డి, నన్నపనేని రామారావు, మండల ఎస్ టి సెల్ అధ్యక్షులు అత్మ కమిటీ డైరెక్టర్ బాణావత్ శ్రీను, భూక్యా బాలాజీ, చొప్పవరపు శ్రీనివాసరావు,తదితర నాయకులు పాల్గొని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు.

### ప్రతి ఒక్కరికి
## చట్టాలపై అవగాహన ఉండాలి
### జిల్లా జడ్జి శ్రీనివాసరావు



**సత్తుపల్లి జూలై25(ప్రజా జ్యోతి)** విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాసరావు అన్నారు. శనివారం హెటిరో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా సూటికల్స్ సైన్సెస్ నందు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు విద్యార్థులకు తెలియజేయడం వలన,ఏది మంచి, ఏది చెడు అనేది తెలుసుకుంటారని, ప్రతి ఒక్కరు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, క్రిమినల్ కేసులు సివిల్ కేసులు ఫోక్స్, బి ఎన్ ఎస్, ఎన్.డి.పి.ఎస్ చట్టాలపై క్షుణ్ణంగా వివరించారు. ఏ పని చేయాలన్నా ఆవేశంతో కాకుండా,ఆలోచనతో చేయాలని, దీని ద్వారా మంచి చెడు తెలుస్తుందని, నేరాలు కంట్రోల్ అవుతాయని తెలిపారు. సమాజంలో మంచిని గ్రహించి చెడును వదిలివేసి, ఒక గోల్ పెట్టుకొని భవిష్యత్తులో స్థిరపడేందుకు చదవాలని వివరించారు. మోటార్ వాహన చట్టం పై అవగాహన,డ్రగ్స్ వంటి జోలికి వెళ్ళవద్దని,తల్లిదండ్రులు మాట,అధ్యాపకులు మాట వినాలని తద్వారా సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని ప్రతి ఒక్కరు సమాజానికి ఉ పయోగపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికుమార్,ఎస్.ఎస్.ఐ.టి ప్రిన్సిపల్ వి ఎస్ ఆర్ కుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సీతారాం, ఉపాధ్యాయులు విద్యార్థులు కోర్టు సిబ్బంది ఉన్నారు.

### ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన
## జగన్నాధపురం సర్పంచ్ తాళ్లూరి స్వప్న



**చింతకాని జులై 25ప్రజాజ్యోతి :**జగన్నాధపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అల్పాహార కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆకలితో తరగతులకు హాజరుకాకుండా, ఉదయం నుంచే పోషకాహారం అందించి వారి ఆరోగ్యం, చదువుపై ఏకాగ్రతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన అల్పాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటు అందుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో.. వార్డు సభ్యురాలు తన్నీరు రమ, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, అంగన్వాడి టీచర్ కాసిమాల వెంకమ్మ, ఆయా యరమల పద్మ, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ కన్యక పరమేశ్వరి అమ్మవారికి వెండి పళ్లెం గిన్నె కానుక అందజేసిన
### ప్రొద్దుటూరు గ్రామ వాసులైన శ్రీనివాసరావు పద్మావతి దంపతులు

**చింతకాని జులై 25ప్రజాజ్యోతి :**పెనుగొండ శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రొద్దుటూరు గ్రామ వాస్తవ్యులు బాలాజీ ట్రేడర్స్ అధినేత బాదం శ్రీనివాసరావు బి పద్మావతి పుణ్య దంపతులు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కి సుమారు రెండు లక్షల రూపాయల విలువైన వెండి పళ్లెం గిన్నెను కానుకగా అందజేసినారు అనంతరం ఆలయ ధర్మకర్మకర్తల మండలి సభ్యులు బాదం శ్రీనివాసరావు పద్మావతి పుణ్య దంపతులను



శాలువతో ఘనంగా సన్మానించారు అనంతరం ఆలయ అర్చక స్వాములు ఈ పుణ్య దంపతులను వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదములను వీరికి అందించినారు ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం కౌన్సిల్ సభ్యులు,చల్లా నవీన్ కుమార్,ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

### మధిరను రాష్ట్రానికే ఆదర్శవంతమైన
# క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా తీర్చిదిద్దుతాం
### ◇ చైర్‌పర్సన్ సామినేని సుజాత!

**మధిర, ప్రజాజ్యోతి** మధిర పట్టణాన్ని పరిశుభ్రతకు మారుపేరుగా,రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా యంత్రాంగం అడుగులు వేస్తోంది.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో మధిర అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు వెల్లువెత్తుతుండటంతో, పట్టణంలో ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం సంకల్పానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని, మన మధిరను మనమే క్లీన్‌గా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పిలుపునిచ్చారు. ఈ అభివృద్ధి బాటలో భాగంగానే పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మన మధిర - మన బాధ్యత పేరుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజుల శానిటైజింగ్ యాక్షన్ ప్లాన్ అమలును ముమ్మరం చేశారు. ఇందులో తొలి దశలో



భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాలుగో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికుల్లో నూతన చైతన్యం నింపారు.వార్డులో గడపగడపకూ తిరిగిన ఆమె.. తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడం వల్ల కలిగే లాభాలను ప్రజలకు పూసగుచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ,చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా మన మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలి.ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాలను కంటికి రెప్పలా శుభ్రంగా ఉంచుకుంటేనే మన పట్టణ సుందరీకరణ సాధ్యమవుతుంది. ఇది మనందరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతో పాటు,ప్రజల భాగస్వామ్యంతో మధిరను రాష్ట్రానికే ఆదర్శవంతమైన క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా తీర్చిదిద్ది తీరుతామని ఆమె ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ బెనిటిక్ ఇస్రాయిల్ పాల్, ఇన్విం్ర ప్రైవేటు లిమిటెడ్ సీఈవో సుద్దాల ఉదయ్ చంద్ర, 13 వార్డ్ కౌన్సిలర్ షేక్ రసీద్దీన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించిన మత్కేపల్లి గ్రామ సర్పంచ్ కంచం ద్రౌపది

**చింతకాని జులై 25 ప్రజాజ్యోతి :**మండల పరిధిలోని మత్కేపల్లి ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత అల్పాహార (ఫ్రీ బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని హరే కృష్ణ ఫౌండేషన్ సహకారంతో ప్రారంభించారు. విద్యార్థుల చదువుకు ఆకలి అడ్డంకిగా మారకుండా,వారికి ప్రతిరోజూ పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కంచం ద్రౌపది,ఉప సర్పంచ్ పగడాల పుల్లమ్మ తో



కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ప్రీ-ప్రైమరీ పాఠశాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచం కోటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింశెట్టి శ్రీనివాసరావు, బొల్లకొండ రామారావు, బోలికొండ మధు, గ్రామ సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి , గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బండి అప్పారావు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు..!

◇ పంచాయతీ ఆదేశాలు బేఖాతరా..?

◇ నోటీసులు ఇచ్చినా మారని పంథా

◇ సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో వెలుగులోకి వచ్చిన అక్రమాల వ్యవహారం

◇ నెలలు గడుస్తున్నా తొలగించని నిర్మాణాలు

◇ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారా అనే విమర్శలు

◇ చర్యలు తీసుకోకపోవడమే వారికి అలుసా!

◇ నోటీసులు ఇచ్చి నెలలు గడుస్తున్న తొలగించని నిర్మాణాలు

◇ ఉన్నతాధికారులు జర స్పందించరూ!





**ఇల్లందు, జులై 25 (ప్రజా జ్యోతి)** మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీలపై చేపట్టిన అక్రమ నిర్మాణాలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత వ్యక్తులు వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలను అలాగే కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చి నెలలు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి తొలగింపు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**యథేచ్ఛగా డ్రైనేజీలపై నిర్మాణాలు!**

సుభాష్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో పాటు వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నోటీసులు ఇచ్చినా మారని తీరు**

సుభాష్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై గ్రామపంచాయతీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత వ్యక్తులు వాటిని పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది. దింతో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి వైఖరి ఏమిటనే ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు ముందస్తుగా నోటీసులు జారీచేసి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వారికి అలుసుగా మారిందనే ప్రచారం జరుగుతుంది.

**ఎవరు ఏమి చేయలేరనే ధీమా..?**

డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాల విషయంపై సంబంధిత పంచాయతీ అధికారులు ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోరనే ధీమాతోనే కొందరు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందుకే నోటీసులు వచ్చినా నిర్మాణాలు యథాతథంగా కొనసాగుతున్నాయని అంటున్నారు.

**నెలలు గడిచినా తొలగింపులు శూన్యం**

డ్రైనేజీలపై నిర్మాణాల విషయంలో గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసి నెలలు గడిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క నిర్మాణాన్ని కూడా తొలగించకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా అని సూటిగా ప్రశ్నిస్తున్నారు.

**అధికారుల ఆదేశాలకు విలువ లేదా..?**

సుభాష్ నగర్ గ్రామపంచాయతీలో అధికారులు ఇచ్చిన ఆదేశాలను సైతం కొందరు పట్టించుకోకపోవడం అధికార యంత్రాంగం ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టిన వారు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటి అని ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి.

**చర్యలు తీసుకోకపోవడమే అలుసుగా మారిందా?**

సుభాష్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీలపై నిర్మాణాల విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే మరింత మంది ఆక్రమణలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**ఇదెక్కడి తీరు అని ప్రశ్నిస్తున్న ప్రజలు**

డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా ఎలాంటి చర్యలు లేకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా డ్రైనేజీలపై ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారి పట్ల ఉదాసీనతగా వివరించడంతో సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఉన్నతాధికారులు జర స్పందించరూ!**

డ్రైనేజీలపై ఉన్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నిర్మాణాలను వెంటనే తొలగించాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు. గ్రామపంచాయతీ నిబంధనలు ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తించేలా అధికారులు వ్యవహరించాలని, అక్రమ నిర్మాణాల విషయంలో ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఇలాంటి ఆక్రమణలు మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక పంచాయతీ, మండల, జిల్లా అధికారులు స్పందించి ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న సందిగ్ధత ప్రజల్లో నెలకొంది.

## క్రిస్టియన్ సర్వెంట్ నేషనల్ అవార్డు అందుకున్న పాస్టర్ శ్రీనివాస్ పాల్

**టేకులపల్లి, జూలై 25,ప్రజాజ్యోతి:** వరంగల్ మండి బజార్‌లోని సెంటినరీ ట్రినిటీ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన క్రైస్తవ హక్కుల రక్షణ సమితి రెండవ వార్షికోత్సవంలో టేకులపల్లి మండలం బోడు గ్రామానికి చెందిన ఇమ్మానుయేలు ప్రార్థన మందిర సేవకులు, మండల అధ్యక్షులు పాస్టర్ శ్రీనివాస్ పాల్‌కు వ్యవస్థాపకులు జన్ను యిర్మియా చేతుల మీదుగా క్రిస్టియన్ సర్వెంట్ నేషనల్ అవార్డు ప్రదానం చేశారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవలు, చర్చిల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, కొత్తకోయ గిరిజనులకు నిత్యావసర వస్తువుల పంపిణీలో ఆయన చేసిన సేవలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో అయూబ్, బోడ డిన్న, జన్ను శిబారాణి రాణి తదితరులు పాల్గొన్నారు.



### వైభవంగా తొలి ఏకాదశి
## మహోత్సవాలు.. పోటెత్తిన భక్తజనం

◇ సుప్రభాత సేవ నుంచి కల్యాణోత్సవం వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహణ

◇ గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం

◇ కల్యాణోత్సవం, అన్నదానానికి చేయూతనిచ్చిన హైదరాబాద్ వాస్తవ్యులు మోరపాక నాగేశ్వరరావు-సాయి సాత్విక దంపతులు







**అన్నపురెడ్డిపల్లి, జూలై 25 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా శనివారం విశేష పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో స్వామివారికి పవిత్ర అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. తొలి ఏకాదశి పర్వదినంతో పాటు శనివారం కావడంతో మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం “గోవిందా... గోవిందా...” నామస్మరణలతో మారుమోగింది. భక్తులు విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రతి శనివారం నిర్వహించే శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని యథావిధిగా వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దివ్య కల్యాణాన్ని తిలకించారు. వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన కల్యాణోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ వాస్తవ్యులు మోరపాక నాగేశ్వరరావు--సాయి సాత్విక దంపతులు స్వామివారి కల్యాణోత్సవంతో పాటు అన్నప్రసాద వితరణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏడాది తొలి ఏకాదశి పర్వదినాన ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి విచ్చేసి స్వామివారి సేవలో భాగస్వాములవుతూ కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కూడా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ ఈవో పి.వి. రమణ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీర్థప్రసాదం, తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ తదితర ఏర్పాట్లను సమర్థంగా నిర్వహించడంతో తొలి ఏకాదశి మహోత్సవాలు భక్తిపారవశ్య వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

## ఆటో బోల్తా.. మహిళకు తీవ్ర గాయాలు
### 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందన.. ఇల్లందు ఏరియా ఆసుపత్రికి తరలింపు



**టేకులపల్లి,జూలై 25,ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం తోగూడెం నుంచి టేకులపల్లి మండల కేంద్రంలోని సంతకు కూరగాయలు తీసుకువస్తున్న ఆటో శనివారం ప్రమాదానికి గురైంది. టేకులపల్లి మండలం సాయన్నపేట మూలమలుపు వద్దకు రాగానే ఆటో టైరు అకస్మాత్తుగా పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో ఆటోలో నలుగురు ప్రయాణికులు ఉన్నారు. వీరిలో అజ్మీర పద్మ (40)కు నడుము భాగంతో పాటు పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే టేకులపల్లి 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించింది. అనంతరం ఈఎంటీ సునీత, పైలెట్ నాగేశ్వరరావు గాయపడిన వారిని సురక్షితంగా ఇల్లందు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చేర్పించారు. అత్యవసర సమయంలో వేగంగా స్పందించి సేవలందించిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

## సరూర్‌నగర్‌లో 33 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి

**ఆగస్టు 3లోగా ఫారాలు బిఎల్ ఓ లకు అందజేయాలి: ఈఆర్ఓ జగదీశ్వర్ రెడ్డి**

**బిఎల్ఏలు, కాలనీల సంఘాల ప్రతినిధులతో సర్ ప్రగతి సమీక్ష సమావేశం**

రంగారెడ్డి జూలై 25 (ప్రజాజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని సరూర్‌నగర్ సర్కిల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కందుకూరు ఆర్డీఓ, మహేశ్వరం నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి ( ఈఆర్వో ) ఎన్. జగదీశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సరూర్‌నగర్ సర్కిల్‌కు చెందిన





పోలింగ్ స్టేషన్లు 45 నుంచి 119 వరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఓ ), కాలనీల అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.సరూర్‌నగర్ సర్కిల్‌లో ఇప్పటివరకు 33 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. గడువు తేదీ వరకు వేచి ఉండకుండా ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు వెంటనే అందజేయాలని సూచించారు. ఫారాల సమర్పణకు ఆగస్టు 3, 2026 చివరి తేదీ అని గుర్తుచేశారు.ఓటర్లకు ఫారాల పంపిణీ, వాటిని సక్రమంగా నింపించడం, తిరిగి అందించే ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో షిఫ్టెడ్, డబుల్, మరణించిన ఓటర్లను గుర్తించి ఎన్నికల జాబితా ప్రక్షాళనలో భాగస్వాములు కావాలని సూచించారు.సమావేశంలో సరూర్‌నగర్ సర్కిల్ ఈఆర్వో శ్రీనివాస్, మహేశ్వరం నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నరేష్, సూపర్‌వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కాలనీల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

మొదటిపేజీ తరువాయి..

చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజీపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజీపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.

## పదవులు తాత్కాలికం..

మొదటిపేజీ తరువాయి..

' ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## ఫ్రాన్స్, స్పెయిన్‌లలో కార్చిచ్చు..

బోర్డియక్స్ ,జులై 25 (ప్రజాజ్యోతి): ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లోని పలు ప్రాంతాల్లో అడవి మంటలు భీభత్సం సృష్టిస్తున్నాయి. ఎన్నడూ లేని స్థాయిలో ఎగసిపడుతున్న ఈ మంటల దెబ్బకు రెండు దేశాల్లో సుమారు రెండు లక్షల మందికి పైగా ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లినట్లు ది గార్డియన్ కథనం పేర్కొంది. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, బలమైన గాలుల కారణంగా ఈ మంటలు అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బంది సైతం ఈ పరిస్థితిని అదుపు చేయలేక తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఫ్రాన్స్‌లోని ప్రముఖ నగరమైన బోర్డియక్స్ శివారు ప్రాంతాలు, జిరోండే సమీపంలో మంటలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. సవి సెలవులు గడిపేందుకు వచ్చిన పర్యాటకులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ రంగంలోకి దిగి సైన్యాన్ని మోహరించారు. యూరోపియన్ యూనియన్ సహాయం కూడా కోరారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ సమీపంలో కూడా మంటలు తీవ్రంగా చెలరేగడంతో ఆ దేశ ప్రధాని పెడ్రో సాంచెజ్ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఫ్రాన్స్ తీర ప్రాంతమైన క్యాప్ ఫెరెట్ ప్రాంతం నుంచి వేలాది మంది ప్రజలను ప్రత్యేక పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఏడాది ఫ్రాన్స్ చరిత్రలోనే అత్యధిక విస్తీర్ణంలో అడవులు తగలబడ్డాయి. జాతీయ విపత్తుల రక్షణ దళం రేయింబవళ్లు శ్రమిస్తున్నా అడవి మంటలు ఏమాత్రం అదుపులోకి రావడం లేదు. స్పెయిన్‌లోని మాడ్రిడ్ సమీపంలో మంటలు ఉగ్రరూపం దాల్చాయి. ఆ దేశ అధికారులు మంటలు వ్యాపించే తీవ్రతను చూసి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దట్టమైన పొగలు కమ్మేయడంతో మాడ్రిడ్ నగరంలో వాతావరణం భయానకంగా మారింది. అప్రమత్తమైన అధికారులు ఎక్కడికక్కడ సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రెండు దేశాలకు పొరుగు దేశాల అండ ఎంతో అవసరం. ఫైర్ ఫైటింగ్ విమానాలు, ప్రత్యేక హెలికాప్టర్లను పంపేందుకు మిత్ర దేశాలు ముందుకు వస్తున్నాయి.

# చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ సాధ్యం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. ప్రభాకర రావు**

**బాలల రక్షణ, హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ బ్యూరో, జూలై 25, (ప్రజా జ్యోతి): ప్రజల్లో చట్టాలపై సమగ్ర అవగాహన పెంపొందినప్పుడే రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా వినియోగించుకోగలరని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా చట్టపరమైన సేవల సంస్థ (డీ ఎల్ ఎస్ ఏ) ఛైర్మన్ కె. ప్రభాకర రావు అన్నారు. న్యాయ అవగాహనను గ్రామస్థాయి వరకు విస్తరించి ఆదిలాబాద్ జిల్లాను వివాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం లో జిల్లా చట్టపరమైన సేవల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నాల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్' అవగాహన సదస్సు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బాలల రక్షణ అధికారుల ఓరియెంటేషన్ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడు తూ, భారత రాజ్యాంగం గర్భస్థ శిశువు నుంచి మరణించిన వ్యక్తి వరకు ప్రతి ఒక్కరి హక్కులను పరిరక్షించే గొప్ప రాజ్యాంగమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా జిల్లా చట్టపరమైన సేవల సంస్థను సంప్రదించాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, పిల్లలు తదితర అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, ప్రజలు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. పిల్లల హక్కుల పరిరక్షణపై పాఠశాల ల్లో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు పాఠశాలలకు వచ్చే జనవరిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డులు అందజేయనున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, బాలికల సంక్షేమం, బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఏడాది పొడవునా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు.జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు ప్రతి నెల ఒక నిర్దిష్ట అంశాన్ని ఎంపిక చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, చర్చలు, ఓరియంటేషన్ తరగతులు, పోటీలు నిర్వహించాలని సూచించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం, సైబర్ భద్రత, మంచి-చెడు స్పర్శ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలు కేవలం విద్య బోధించే కేంద్రాలుగా కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, విలువల పెంపొందింపుకు వేదికలుగా మారాలని అన్నారు. ప్రతి మూడవ శనివారం నిర్వహించే పేరెంట్-టీచర్ సమావేశాల్లో తల్లిదండ్రులకు కూడా బాలల రక్షణ, సైబర్ నేరాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పెరుగుతున్న మొబైల్ ఫోన్ వినియోగం, సోషల్ మీడియా ప్రభావంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులను గుర్తించి వెంటనే తల్లిదండ్రులతో చర్చించి తగిన కౌన్సెలింగ్ అందించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా తెలియజేసేందుకు ఫిర్యాదు పెట్టెలు (కంప్లైంట్ బాక్స్‌లు) ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ఒకరిద్దరు ఉపాధ్యాయుల బాధ్యతగా కాకుండా మొత్తం ఉపాధ్యాయ బృందం సమిష్టిగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలు, సంబంధిత అధికారులకు 2027 మే నెలలో జిల్లా స్థాయి, అనంతరం హైకోర్టు స్థాయిలో ప్రత్యేక గుర్తింపు, ప్రశంసలు లభించే అవకాశం ఉందని తెలిపారు.అదనపు ఎస్పీ మౌనిక మాట్లాడుతూ, బాలల భద్రత, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడంలో "పోలీస్ అక్క" కార్యక్రమం విశేష ఫలితాలు సాధిస్తోందన్నారు. గత జూన్ నుంచి ఇప్పటి వరకు 43 ఎఫ్ ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 100కు పైగా ఫిర్యాదులు స్వీకరించి, 23 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ప్రవర్తనలో కనిపించే మార్పులను ఉపాధ్యాయులు ముందుగానే గుర్తించి స్పందిస్తే అనేక మంది పిల్లల భవిష్యత్తును రక్షించవచ్చని ఆమె పేర్కొన్నారు.జిల్లా చట్టపరమైన సేవల సంస్థ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఉపాధ్యాయులను బాలల రక్షణ అధికారులుగా భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ భద్రత, బాలల హక్కులపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి డి. మాదవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, బాలల రక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు



మొదటిపేజీ తరువాయి..

రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి



పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఎ÷-లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷-లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్‌వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

మొదటిపేజీ తరువాయి..

కొత్త హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూడదని కోరారు. 'ఎండ్ హెచ్-1బీ వీసా యాక్ట్' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతే గానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్-1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్-1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. అయితే ఇది ఉభయసభల్లో ఆమోదం పొందిన తరవాతనే బిల్లుగా మారనుంది.




## పాలమూరు - రంగారెడ్డిలో కొత్త నిబంధనలు

హైదరాబాద్,జులై 25 (ప్రజాజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్లోని 4 ప్యాకేజీలకు సవరించిన అంచనాలకు మంత్రివర్గం ఆమోదం లభించినా బిల్లులు పాస్ చేసే ముందు పనికి సంబంధించిన వివరాలను నిర్ధారించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. థర్డ్ పార్టీతో పరిశీలింపజేసి, హై పవర్ కమిటీ ఆమోదం తర్వాత గుత్తేదారుకు చెల్లించాలని ఆదేశించింది. ప్రతి పనిని గుత్తేదారు చేశారా? లేదా నిర్ధారించుకోవడం, జాప్యానికి కారణం గుత్తేదారుది కాదు అని రూఢీ చేసుకోవడం సహా పలు నిబంధనలతో తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నీటి పారుదల శాఖ కార్యదర్శికి అంతర్గత మెమో పంపారు. రెండు రోజుల క్రితం పంపిన ఈ మెమో నీటి పారుదల శాఖలో సంచలనం సృష్టించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులకు సంబంధించి చెల్లించే బిల్లులపై సర్కారు మరింత పారదర్శకంగా ముందుకెళ్తోంది. కాంట్రాక్టు ఒప్పంద నిబంధనలు, టెండర్ ప్రక్రియ, పనుల్లో జాప్యం, పెరుగుతున్న వ్యయం ఇలా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని మూడు దశాబ్దాల క్రితం జారీ చేసిన జీవో-94లో మార్పులు చేసేందుకు ఇటీవలే ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. తాజాగా సవరించిన అంచనాకు ఆమోదం తెలిపినా, గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులో నిబంధనలు మరింత కఠినతరం చేస్తూ నిర్ణయం తీసుకొంది.పాలమూరు నుంచి రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 7, 11, 15, 17వ ప్యాకేజీల సవరించిన అంచనాలకు ఈ నెల 17న జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీనివల్ల ఖజానాపై అదనంగా రూ.2,353.38 కోట్ల భారం పడింది. 2016లో ఈ నాలుగు ప్యాకేజీల పనులకు ఒప్పందం జరగ్గా, భూ సేకరణలో ఆలస్యం, ఎన్జీటీలో కేసులు తదితర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగింది. పదేళ్లైనా ఇంకా పనులు పూర్తి కాలేదు. ఒప్పందం ప్రకారం జరగకపోవడంతో పెరిగిన ధరల వర్తింపు, అదనంగా పని చేయాల్సి రావడం, జీఎస్టీతో సహా పెరిగిన పన్నుల భారం వల్ల భారీగా అంచనాలు పెరిగాయి. రెండేళ్లుగా ఆర్థిక, నీటి పారుదల శాఖల చుట్టూ తిరిగిన తర్వాత సవరించిన అంచనాలకు మంత్రివర్గం ఆమోదం లభించింది. ఇందులో ఏదుల వద్ద ఉన్న వీరాంజనేయ రిజర్వాయర్ నుంచి వట్టెం వద్ద ఉన్న వెంకటాద్రి రిజర్వాయర్‌కు నీటిని తీసుకెళ్లే మార్గంలోని సొరంగానికి సంబంధించిన ఏడో ప్యాకేజీలో రూ.918 కోట్లు పెరిగింది. వెంకటాద్రి రిజర్వాయర్‌లో మట్టికట్ట నిర్మాణానికి సంబంధించిన 11వ ప్యాకేజీలో 682.75 కోట్లు పెరిగింది.కురుమూర్తిరాయ రిజర్వాయర్ మట్టికట్ట నిర్మాణానికి సంబంధించిన 15వ ప్యాకేజీలో 491.85 కోట్లు, ఉదండాపూర్ రిజర్వాయర్ మట్టి కట్ట నిర్మాణానికి సంబంధించిన 17వ ప్యాకేజీలో రూ.260.78 కోట్లు పెరిగింది. ఈ పెంపునకు మంత్రివర్గ ఆమోదం లభించడంతో ఇక మిగిలింది బిల్లుల చెల్లింపే అని నీటి పారుదల శాఖ భావించింది. అయితే చెల్లింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన నోట్ నీటి పారుదల శాఖను ఆశ్చర్యపరిచింది. అదనంగా చేయాల్సి వచ్చిన పని, చేసిన పనిని సంబంధిత ఇంజినీర్లు నిర్ధారించి పంపడం, రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ, హైపవర్ కమిటీ ఆమోదం లభించగానే చెల్లించే వారు. ఇప్పుడు చేసిన పనిని నిర్ధారించుకొన్న తర్వాతనే బిల్లులు చెల్లించాలని సీఎస్ స్పష్టం చేశారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967